

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 09.07.2026 | సంపుటి: 3 | సంచిక: 157 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | THURSDAY | 09.07.2026 | V0LUME : 3 | ISSUE : 157 | PAGES: 8 | COST: 2/- |

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

## కేంద్రంపై నెపం నెట్టడం తగదు


- మౌలిక సదుపాయాల ఏర్పాట్లు లేవు
- ధాన్యం కొనుగోలులో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



3

## తాడిచెర్ల2 కేటాయింపులపై తప్పుడు ప్రకటన

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తప్పదోవ పట్టించే యత్నం
- మీడియా సమావేశంలో మండిపడ్డ డిప్యూటీ సిఎం భట్టి



హైదరాబాద్, జూలై8( రాజముద్ర న్యూస్)

సింగరేణి బొగ్గు గనుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి

మిగతా 2వ పేజీలో..

## సింగరేణిని ఆదుకున్నది కేంద్రమే

- కాంగ్రెస్‌వి క్రెడిట్ పాలిటిక్స్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



హైదరాబాద్, జూలై8( రాజముద్ర న్యూస్)

గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి సంస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసి నష్టాల్లోకి నెట్టేస్తే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మాత్రమే సంస్థను బలోపేతం చేస్తూ కాపాడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియా

మిగతా 2వ పేజీలో..



## చంద్రబాబు కోసమే గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు

- చెరువుల ఎండిపోతున్నా నీళ్లు ఎత్తి పోయడం లేదు
- తుమ్మడిహట్టి వద్ద అనుమతులు అంటే ఆనాడే ఎందుకు కట్టలేదు
- నేరపూరిత నిర్లక్ష్యానికి పాల్పడిన మిమ్ములను ఉరితీసినా పాపం లేదు
- మీడియా సమావేశంలో ఫైర్ అయిన హరీష్ రావు

హైదరాబాద్, జూలై8( రాజముద్ర న్యూస్)

గోదావరిలో నీళ్లు ఉన్నా ఎత్తిపోయకపోవడం నేరపూరిత నిర్లక్ష్యం కిందకి వస్తుందని.. మిమ్మల్ని ఉరి తీసినా తప్పు లేదని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఫైర్ అయ్యారు. చంద్రబాబుకు గురు దక్షిణ చెల్లించడానికే గోదావరి నీళ్లను వదిలేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ

మిగతా 3వ పేజీలో..

# కాంగ్రెస్–బీజేపీ కోల్ వార్..!



- తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ చుట్టూ రాజకీయ రగడ
- కేంద్రం కేటాయించిందా..? రాష్ట్ర పోరాటంతో అనుమతులు వచ్చాయా..?
- సింగరేణి, బొగ్గు గనులే తాజా రాజకీయ సమరభూమి
- ఇది పాత కేటాయింపేనని కాంగ్రెస్, తామే అనుమతులిచ్చామని బీజేపీ వాదన.
- కార్మికుల మద్దతు కోసం ఇరు పార్టీలు దీనిని రాజకీయ అస్త్రంగా మార్చాయి.
- కోయగూడెం, సత్తుపల్లి బ్లాకులను కూడా సింగరేణికే ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్

హైదరాబాద్, జూలై8( రాజముద్ర న్యూస్)

తెలంగాణ రాజకీయాల్లో బొగ్గు గనుల అంశం మరోసారి కాంగ్రెస్-బీజేపీ మధ్య తీవ్ర రాజకీయ పోరుకు వేదికగా మారింది. తాడిచెర్ల 2 బొగ్గు బ్లాక్ కేటాయింపు, సింగరేణి భవిష్యత్, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పాత్రపై ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఒకవైపు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వమే సింగరేణికి తాడిచెర్ల 2 బ్లాక్‌ను కేటాయించి అవసరమైన అనుమతులు ఇచ్చిందని చెబుతుండగా.. మరోవైపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆ వాదనను పూర్తిగా ఖండిస్తూ, ఇది ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని ఆరోపించారు.

**'కొత్త కేటాయింపు కాదు' అంటున్న కాంగ్రెస్**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మిగతా 3వ పేజీలో..





## కాళేశ్వరం పై ఇంకెన్నాళ్లు కట్టుకథలు

నీళ్లు లేక రైతులు అవస్థలు పడుతుంటే చోద్యమా

గోదావరి నీళ్లు ఎత్తిపోయడమే శరణ్యం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూలై 8:

ఒకపక్క నీళ్లు లేక పల్లెల్లో రైతన్నల కన్నీళ్లు పెట్టుకుంటుంటే మరోపక్క మేడిగడ్డ కాడ లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా కిందకు పోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్

మిగతా 2వ పేజీలో..



3

## రెండున్నరేళ్ల పాలనలో 8 లక్షల ఇళ్ల మంజూరు

## కెనడా పెట్టుబడిదారులకు సీఎం ఆహ్వానం

- రాష్ట్ర ప్రగతి దిశ, ఉద్యోగ కల్పనపై కెనడా హైకమిషనర్ ప్రశంసలు
- కెనడా పర్యటనకు రేవంత్‌ను ఆహ్వానించిన క్రిస్ కూటర్

హైదరాబాద్, జూలై8( రాజముద్ర న్యూస్)

కెనడాతెలంగాణ మధ్య వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణల రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై కెనడా హైకమిషనర్ టు ఇండియా క్రిస్ కూటర్ బుధవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో చర్చించారు. తెలంగాణలో చేపడుతున్న భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు, పట్టణాభివృద్ధి

మిగతా 2వ పేజీలో..





## ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టుకు భూమి కేటాయింపు

2

- సీఎంను కలిసిన 'గోద్రెజ్' ప్రతినిధులు
- గోద్రెజ్ ఆయిల్ పామ్ ప్రాజెక్టుకు 113.5 ఎకరాల కేటాయింపు..



## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణం చెల్లించాలి

- లేకపోతే కాంగ్రెస్‌కు భారీ మూల్యం తప్పదు
- 20న విద్యార్థుల మిలియన్ మార్చ్ కు పిలుపు
- అఖిలపక్షం, బీసీ సంఘాల నాయకులు

ఖైరతాబాద్, జూలై8( రాజముద్ర న్యూస్)

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని అఖిలపక్ష పార్టీలు, బీసీ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్

మిగతా 3వ పేజీలో..

## మావోయిస్టులు లేకపోవడంతో గంజాయి పెరిగింది

- సరిహద్దు జిల్లాలపై గట్టి నిఘా
- ఈగల్ తరహాలో టీ-మాస్ బ్యూరో
- రాష్ట్ర డీజీపీ ఆనంద్

3



## ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధిలో ముందడుగు



2

## ఉద్యమకారుల గుర్తింపే ప్రభుత్వ సంకల్పం

- రాజకీయాలకు అతీతంగా ప్రతి ఉద్యమకారుడికి న్యాయం చేస్తాం
- వివిధ విశ్వవిద్యాలయాల జేఏసీ నేతలతో ఉన్నత స్థాయి కమిటీ సమావేశం

2

# ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టుకు భూమి కేటాయింపు

**హైదరాబాద్, జూలై 8 :**

ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, ఆర్ అండ్ డి కేంద్రం, సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమిని గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ వ్యవహారాలు) రాకేష్ స్వామి, గోద్రెజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగిలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా గోద్రెజ్ ఆగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపై రాకేష్ స్వామి ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా 700 మందికి పైగా ఉపాధి లభించనుంది. సీడ్ గార్డెన్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని ఆ సంస్థ ప్రభుత్వాన్ని కోరింది. ప్రాసెసింగ్ మిల్ కోసం రాహదారిని విస్తరించాలని ముఖ్యమంత్రిని కోరగా టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని సీఎం ఆదేశించారు.

**సీఎంను కలిసిన మలేసియా ఎంపీ**

మలేసియా పార్లమెంటు సభ్యుడు డాక్టర్ ఎం.శరవణన్ ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రీన్ గ్రోత్ ఎకనామిక్ సమ్మిట్ 2026లో పాల్గొనడానికి ఆయన హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సమ్మిట్లో పాల్గొన్న మరికొందరు అంతర్జాతీయ ప్రతినిధులు కూడా సీఎంను కలిశారు. పర్యావరణ, సామాజిక, పరిపాలనాపరమైన అంశాలతో పాటు మౌలిక సదుపాయాలు, ఏఐ వినియోగంతోపాటు భవిష్యత్తు పెట్టుబడులపై ముఖ్యమంత్రి, శరవణన్, అంతర్జాతీయ ప్రతినిధుల మధ్య చర్చ జరిగింది. సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

# తాడిచెర్ల2 కేటాయింపులపై తప్పుడు ప్రకటన

మొదటిపేజీ తరువాయి

కాలరీస్‌కు తాడిచెర్ల2 బొగ్గు బ్లాక్‌ను తామే కొత్తగా కేటాయించామని, దానికి సంబంధించిన కొన్ని క్లియరెన్సులు ఇచ్చామని కేంద్ర పెద్దలు ప్రచారం చేసుకోవడంపై మండిపడ్డారు. వాస్తవాలను పూర్తిగా పక్కన పెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించేలా వేరేలా చిత్రీకరించడం ఎంతమాత్రం సరి కాదని స్పష్టం చేశారు. తాడిచెర్ల2 బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో 2013 లోనే సింగరేణి కాలరీస్‌కు అధికారికంగా కేటాయించిందని గుర్తుచేశారు. పైగా, గిరిజన ప్రాంతాలలో ఉండే బొగ్గు గనులను నిబంధనల ప్రకారం కేవలం ప్రభుత్వ కంపెనీలకు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని, అలాంటప్పుడు ఇప్పుడు కొత్తగా రేదో అలాట్ చేసినట్లు చెప్పుకోవడం ఏంటని ప్రశ్నించారు. సింగరేణికి తాడిచెర్ల కోల్ బ్లాక్ 2 కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ వాస్తవాలు దాచిపెట్టి వేరేలా చిత్రీకరించడం సరికాదని భట్టి విక్రమార్క అన్నారు. మీడియాతో బుధవారం మాట్లాడుతూ 2013 సెప్టెంబర్ 16న ఈ కోల్ బ్లాకును ఆనాటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని గుర్తుచేశారు. ఇప్పుడు కొత్తగా కోల్ బ్లాక్ కేటాయించినట్టు చెప్పడం ఏంటని ప్రశ్నించారు. మైనింగ్ లీజుకు దరఖాస్తు చేస్తే ఇన్నాళ్లూ పెండింగ్‌లో పెట్టారని, ఎమ్ఎమ్‌బీ ఆర్ యాక్ట్ ప్రకారమంటే ఈ బ్లాకును సింగరేణికి కేటాయించారని తెలిపారు. కేంద్ర మంత్రులను కలిసి చరిత్ర మొత్తం వివరించామని భట్టి అన్నారు. కొట్లాడి లీజుకు తెచ్చుకున్నామన్నారు. ట్రైబల్ ఏరియాలో ట్రైబల్స్ లేదా ప్రభుత్వ సంస్థలు మాత్రమే పని చేయాలని, ప్రైవేట్ కంపెనీలు పని చేయడానికి అవకాశం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లి బ్లాక్ 3, కోయగూడెం బ్లాక్3కు టెండర్ వేశారన్నారు. బీఆర్ఎస్ బినామీలు ఆక్షన్‌లో పాల్గొని వాటిని దక్కించుకున్నారన్నారు. ఇన్నాళ్లూ సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ లీజుకు ఇవ్వకపోవడం వల్ల వేల కోట్ల నష్టం జరిగిందని చెప్పారు. గోదావరి పరిసరాల్లోని కోల్ బ్లాక్స్ అన్నింటినీ సింగరేణికి కేటాయించాలని భట్టి డిమాండ్ చేశారు. తాడిచెర్ల2 బ్లాక్‌కు సంబంధించిన అసలు చరిత్రను మీడియా ముందుంచారు. 2021లోనే తాము మైనింగ్ లీజుకు సిద్ధమయ్యామని చెప్పా సింగరేణి యాజమాన్యం కేంద్రానికి దరఖాస్తు చేసుకుందన్నారు. కానీ, ఆ మైనింగ్ లీజుకు ఆమోదం ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నాన్చుతూ ఇప్పటివరకు ఫైళ్లను పెండింగ్‌లో పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కంపెనీకి లీజు ఇవ్వకుండా జాప్యం చేయడం సరి కాదని తానే స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చామన్నారు. 2024 మార్చిలో అప్పటి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి ఈ బ్లాకు సంబంధించిన పూర్వపరాలన్నింటినీ వివరించామని తెలిపారు. తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా కలిసి వినతి పత్రం కూడా సమర్పించారని గుర్తు చేశారు. లీజు ఇవ్వకపోతే సింగరేణి తీవ్రంగా నష్టపోతుందనే వాస్తవాన్ని కేంద్రం ముందు ఉంచి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పోరాడి అనుమతులు తెచ్చుకుందని స్పష్టం చేశారు. అదంతా దాచేసి ఎప్పుడో ఇచ్చినదానికే తామే కేటాయించామని కేంద్రం ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ విధానాలను ఎండగడుతూ 2022లో కోయగూడెంలోని బ్లాక్3 ని కేంద్రం వేలంలో పెట్టి నిబంధనలకు విరుద్ధంగా ఒక ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టిందని ఆరోపించారు. ఆ బ్లాక్ అప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం ఓపెన్ కూడా కాలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి నిజంగానే సింగరేణి సంస్థకు మేలు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే కోయగూడెం బ్లాక్3తోపాటు సత్తుపల్లి బ్లాక్3 గనులను కూడా తక్షణమే సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని కనీసం వేలంలో కూడా పాల్గొననీయకుండా నష్టం చేసిందని మండిపడ్డారు.

# కాళేశ్వరంపై ఇంకెన్నాళ్లు కట్టుకథలు

మొదటిపేజీ తరువాయి

ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంలో నీరో చక్రవర్తి మించిపోయి సర్కారు తమాషా చూస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్‌పై కక్షతో రైతన్నలకు శిక్ష వేయడం తగునా అని నిలదీశారు. ఎలినినో పడగ విప్పుతుంటే..ముప్పు ముంచుకొస్తుంటే ఇంకా రాక్షస రాజకీయ క్రీడలు ఆడుతూ కూర్చుంటారా? ఇంకెన్నాళ్లు కాళేశ్వరం మీద దుష్ప్రచారాలు చేస్తూ కాలక్షేపం చేస్తారు? ముఖ్యమంత్రికి రైతు ముఖ్యమా? రాజకీయం ముఖ్యమా? అని మండిపడ్డారు. పగలు..ప్రతీకారాలు ప్రతిపక్షం మీద తీర్చుకోండి, అన్నం పెట్టే రైతన్నను మాత్రం ఆగం చేయకండి అని హితవు పలికారు. కాళేశ్వరంలో నిండుగా నీళ్లు పారుతున్నా పొలాలను ఎండబెట్టడం కాంగ్రెస్ కక్ష పాలన తీరును ప్రశ్నించండి అని రైతన్నలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎక్కడా చుక్కనీళ్లు లేని కాలంలోనూ కాళేశ్వరమే ప్రాణేశ్వరమై రైతాంగాన్ని కాపాడుతుందని తెలుసుకోవాలన్నారు. వానల్లేక ఎవుసం జరగక అన్నదాత అల్లాడుతుంటే ప్రభుత్వానికి పాపం అనిపించడం లేదా.. కాళేశ్వరం దగ్గర వరద తొక్కుతున్న గోదావరి జలాలను ఎత్తిపోసి గోసి తీర్చాలన్న సోయి కలగట్లేదా అని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. లోటు వర్షపాతంతో నాట్లు పడట్లేదు.. విత్తనాలు వేయట్లేదు.. పంటలు సాగుచేసే పరిస్థితి లేదని అన్నారు. ప్రభుత్వమేమో పట్టించుకోకుండా దున్నపోతు మీద వానపడ్డట్లే వ్యవహరిస్తున్నదని తెలిపారు. కన్నెపల్లి పంప్ హౌజ్ మోటర్లను నడిపించి కరువు రాకుండా కాపాడుకోవాలన్న బుద్ధి ఎందుకు లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**తెలంగాణ సంపన్న రాష్ట్రం : ప్రపంచ బ్యాంక్ నివేదికపై కేటీఆర్ హర్షం**

తెలంగాణ ఎగువ మధ్యాదాయ స్థాయిని దాటిన సంపన్న రాష్ట్రమంటూ ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించడంపై కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ దేశంలో ఈ హోదాను సాధించిన ఐదు అగ్రరాష్ట్రాల్లో తెలంగాణ ఉండటం గర్వకారణమన్నారు. తెలంగాణ విఫల రాష్ట్రం కాలేదని.. సఫల సంపన్న రాష్ట్రమే సగర్వంగా నిలిచిందని పేర్కొన్నారు. 'తెలంగాణ ప్రజలు గర్వించే సందర్భం ఇది..సాధించుకున్న స్వరాష్ట్రం సంపన్నరాష్ట్రంగా అవతరించిందని అన్నారు. తమ చెమటను, నైపుణ్యాన్ని,మేధస్సును రంగరించి తెలంగాణను శిఖరాల నుంచి శిఖరాలకు చేర్చిన ప్రతి పౌరుడికీ శుభాభివందనాలు.. తెలంగాణ వస్తే జాతి సంపద పెరిగింది.. జనం ఆదాయం అద్భుతంగా పెరిగింది.. కేసీఆర్ దార్శనిక పాలనలో అద్భుత వ్యవస్థ అద్వితీయంగా అభివృద్ధి చెందిందని జాతీయ నివేదికలే కాదు.. అంతర్జాతీయ సంస్థలు తేల్చిచెబుతున్నాయి.. దివాలా రాష్ట్రం అని దిక్కుమాలిన ప్రచారాలు చేసేవాళ్లకు ప్రపంచ బ్యాంకు తాజా నివేదికే సమాధానం అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# కెనడా పెట్టుబడిదారులకు సీఎం ఆహ్వానం

మొదటిపేజీ తరువాయి

కార్యక్రమాలపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. ముఖ్యంగా మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు, మెట్రో రైలు విస్తరణ, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల్లో కెనడా భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలపై ఇరువురూ చర్చలు జరిపారు. తెలంగాణకెనడా మధ్య పెరుగుతున్న పారిశ్రామిక, ఆర్థిక సంబంధాలను ప్రస్తావించిన ఆయన ఇటీవల కెనడాకు చెందిన ప్రముఖ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం సంతోషకరమని పేర్కొన్నారు. ఫిరాన్ టెక్నాలజీ గ్రూప్ హైదరాబాద్‌లో తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం, సీఐబీసీ(సీఐబీసీ) హైదరాబాద్‌లో తన గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్(జీసీసీ)ను ప్రారంభించడం వంటి పరిణామాలు తెలంగాణపై కెనడా కంపెనీల నమ్మకం, విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనమని అన్నారు. దాంతోపాటు ప్రపంచ ప్రసిద్ధి చెందిన క్యాపిటల్ సంస్థ సీపీపీ ఇన్వెస్ట్‌మెంట్స్ హైదరాబాద్‌కు చెందిన సీటీఆర్ ఎల్ఎస్ డేటా సెంటర్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుని పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం రాష్ట్ర పెట్టుబడి సామర్థ్యాన్ని మరింత బలపరిచిందని క్రూటర్ చెప్పారు. ఈ సందర్భంగా ఐటీ, లైఫ్ సైన్సెస్, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో రాష్ట్రం సాధించిన పురోగతిని క్రిస్ కూటర్ బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ప్రపంచంలోని ఫార్చ్యూన్500 కంపెనీల జీసీసీలు హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకుంటున్నాయని తెలిపారు. మూసీ నదీ తీరాన్ని అభివృద్ధి చేసి కొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో సౌర విద్యుత్ విస్తరణ, హరిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కెనడా సహకారం అందించాలని కోరారు. తెలంగాణను ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం వెల్లడించారు. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయన్నారు. కెనడాకు చెందిన ప్రముఖ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో మల్టీయూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న రెండో తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో పాల్గొనాలని కెనడా కంపెనీలు, పెట్టుబడిదారులు, విద్యా సంస్థలను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను కూటర్ ప్రశంసించారు. అభివృద్ధి కార్యక్రమాలకు కెనడా అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చిన క్రిస్ కూటర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కెనడా పర్యటనకు ఆహ్వానించారు. రాబోయే నెలల్లో కెనడా వాణిజ్య ప్రతినిధి బృందం తెలంగాణకు వచ్చి ఇంధన రంగం, పట్టణాభివృద్ధి, రక్షణ, ఏరోస్పేస్ తదితర రంగాల్లో పెట్టుబడులు, భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చిస్తుందని తెలిపారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి.అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఐటీ,ఈ అండ్ సీ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రిని కలిసిన అంతర్జాతీయ ప్రతినిధులు**

అలాగే పలువురు అంతర్జాతీయ ప్రతినిధులు సీఎం రేవంత్‌ను కలుసుకున్నారు. నిలి గిల్బర్ట్ (యూఎస్ఏ): బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ బోర్డు సలహాదారు, మహేష్ కొండూరు (యూఎస్ఏ), అమెరికా ప్రభుత్వ సలహాదారు (క్రిటికల్ మినరల్స్) మొమెంటం టెక్నాలజీస్ సీఈఓ, అమిత్ మెహ్రా (య□కే), ఆక్సన్ టెక్నాలజీస్ సీఈఓ దిలెక్, నార్వే మాజీ స్టేట్ సెక్రటరీ థామస్ ఫ్రోలిక్, దక్షిణాఫ్రికా పార్లమెంట్ సభ్యుడు సెంథిల్ తొండమాన్, సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్ (సీడబ్ల్యూసీ) అధ్యక్షుడు(శ్రీలంక) తదితరులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

# సింగరేణిని ఆదుకున్నది కేంద్రమే

మొదటిపేజీ తరువాయి

సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థకు కేంద్ర ప్రభుత్వం తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను కేటాయించడం పట్ల తెలంగాణ ప్రజల తరఫున ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. సుమారు 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్న ఈ బ్లాక్ ద్వారా సింగరేణి సంస్థకు రూ.64,000 కోట్లకుపైగా ఆదాయం సమకూరనుందని, అలాగే దాదాపు 1,200మంది నిరుద్యోగ యువతకు కొత్తగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. ఈ బ్లాక్ కేటాయింపుతో సింగరేణి అభివృద్ధితోపాటు, రాష్ట్ర భవిష్యత్తును కూడా కేంద్ర ప్రభుత్వం మరింత బలోపేతం చేసిందని కొనియాడారు.

**కాంగ్రెస్ క్రెడిట్ పాలిటిక్స్**

'తాడిచర్ల2' బ్లాక్‌ను తమ ప్రయత్నాల వల్లే సాధించుకున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకోవడం పూర్తిగా అవాస్తవమని రామచందర్ రావు మండిపడ్డారు. గతంలో కేంద్రంలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఈ బొగ్గు బ్లాకును సింగరేణికి ఎందుకు కేటాయించలేకపోయారో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా నాయకుల సమష్టి కృషితోపాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవ వల్ల మాత్రమే ఈ బ్లాక్ కేటాయింపు సాధ్యమైందని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని తమ సొంత ప్రయోజనాల కోసం వాడుకోగా నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా సింగరేణి నిధులను ఫుట్‌బాల్ మ్యాచ్‌ల వంటి ఇతర కార్యక్రమాలకు మళ్లిస్తూ సంస్థను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. మన్మోహన్ సింగ్ హయాంలో దేశవ్యాప్తంగా బొగ్గు కేటాయింపుల్లో పెద్ద ఎత్తున కోల్ స్కాం వెలుగు చూసిందని, కానీ ప్రధాని మోదీ నాయకత్వంలో బొగ్గు రంగంలో విప్లవాత్మక సంస్కరణలు, పారదర్శకతకు పెద్దపీట వేశారని కొనియాడారు. ఫలితంగానే నేడు కోల్ ఇండియా ద్వారా బొగ్గు ఉత్పత్తి సుమారు 70 శాతం పెరిగిందని, తద్వారా దేశానికి బొగ్గు రంగం నుండి దాదాపు రూ.2.5 లక్షల కోట్ల ఆదాయం సమకూరుతోందని వివరించారు.

**'సిట్' పరిధిని విస్తరించాలి**

రాష్ట్రంలో భూపరిపాలన అస్తవ్యస్తంగా మారిందని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 'ధరణి' పోర్టల్‌లో భారీగా ఫేక్ అకౌంట్లు సృష్టించారని, వాటిపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిందేనని రామచందర్ రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే సుమారు రెండు వేల ఫేక్ అకౌంట్లు వెలుగుచూడటం తీవ్ర ఆందోళనకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 'ధరణి'పై విచారణ జరుపుతున్న 'సిట్' పరిధిని విస్తరించి 'భూభారతి'లో జరుగుతున్న విచ్చలవిడి అవకతవకలపైనా సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. భూభారతి అవినీతిలో భాగస్వాములైన రాజకీయ నాయకులు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ధరణి, భూభారతి పోర్టల్స్‌లో జరిగిన అక్రమాలు బయటపడతాయనే భయంతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కలిసి నాటకాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి, మేడిగడ్డ అంశాలను మళ్లీ తెరపైకి తెస్తూ డ్రామాలాడాలని చూస్తోందని, కాళేశ్వరాన్ని కాస్తా 'డ్రామేశ్వరం'గా మారుస్తున్నారని ఆయన విమర్శించారు. కాళేశ్వరంపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీతో విచారణ జరిపించాలని మొట్టమొదట డిమాండ్ చేసింది బీజేపీయేనని గుర్తుచేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తమ రాజకీయ ప్రయోజనాలను పక్కన పెట్టాలని హితవు పలికారు. లక్షల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతుల జీవితాలతో చౌకబారు రాజకీయాలు చేయొద్దని, అన్నదాతలకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని రామచందర్ రావు ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు.

# ఉద్యమకారుల గుర్తింపే ప్రభుత్వ సంకల్పం

**హైదరాబాద్, జూలై 8**

"రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన ప్రతి ఒక్క నిజమైన ఉద్యమకారుడిని గుర్తించి, గౌరవించడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పం. ఉద్యమకారుల త్యాగాలకు తగిన న్యాయం జరిగేలా కమిటీ తుది నివేదికను పారదర్శకంగా రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం" అని ఉన్నత స్థాయి కమిటీ చైర్మన్ కె. కేశవరావు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సచివాలయం ఎదురుగా ఉన్న తెలంగాణ అమర జ్యోతి ప్రాంగణంలో ఉన్నత స్థాయి కమిటీ సమావేశాలు కొనసాగుతున్నాయి. బుధవారం జేఎన్‌టీయూహెచ్, తెలంగాణ యూనివర్సిటీ, మహాత్మా గాంధీ యూనివర్సిటీ, పాలమూరు యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సిటీ, తెలుగు విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థి జేఏసీ నాయకులు, మలిదశ ఉద్యమకారులు కమిటీతో సమావేశమయ్యారు. కేశవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థి ఉద్యమకారులు, అధ్యాపక ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సూచనలు కమిటీకి వివరించారు. ఉద్యమకారుల గుర్తింపును రాజకీయ కోణంలో కాకుండా పారదర్శకంగా చేపట్టాలని కోరారు. కేవలం గుర్తింపు కార్డుల జారీతో సరిపెట్టకుండా, ఉద్యమ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలకు విద్య, వైద్యం, ఆర్థిక రంగాల్లో ప్రత్యేక సంక్షేమ చర్యలు అమలు చేసి శాశ్వత సామాజిక భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, మేధావుల నుంచి వచ్చిన ప్రతిపాదనలు ఎంతో విలువైనవని కేశవరావు పేర్కొన్నారు. ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన అన్ని సూచనలను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ప్రొఫెసర్ ఎం. కోదండరాం, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి, వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థి జేఏసీ ప్రతినిధులు, పూర్వ ఉద్యమకారులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధిలో ముందడుగు

- **రూ.12 కోట్లతో నాగర్‌కర్నూల్ నూతన**
- **బస్ స్టేషన్‌కు శంకుస్థాపన**
- **నాగర్‌కర్నూల్-వనపర్తి మధ్య**
- **ఆర్టీసీ సర్వీసుల ప్రారంభం**
- **ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల**
- **బాటలోకి తీసుకొచ్చాం**
- **మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

**నాగర్‌కర్నూల్,జూలై 8:**

రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్టీసీ బస్ స్టేషన్‌కు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మరో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నాగర్‌కర్నూల్ నుంచి వనపర్తి వరకు కొత్తగా ప్రారంభించిన ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని కూడా మంత్రులు ప్రారంభించారు. అనంతరం ఉయ్యాలవాడ బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి, అక్కడి వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఇప్పటివరకు 320 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి, సుమారు రూ.11,371 కోట్ల మేర ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేయాల్సిన పరిస్థితులు ఏర్పడి, పలువురు ఆత్మహత్యలకు పాల్పడిన దురదృష్టకర పరిస్థితులను రాష్ట్రం చూసిందన్నారు. అయితే ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం కేవలం మూడు రోజుల్లో కార్మికుల సమస్యలను పరిష్కరించిందని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగుతోందన్నారు. గత పదేళ్లలో ఒక్క కొత్త బస్సును కూడా కొనుగోలు చేయలేదని, ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ఆర్టీసీని ఆపరేషనల్ నష్టాల నుంచి లాభాల దిశగా తీసుకువచ్చామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా



పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని అమలు చేయడంతో పాటు బాండ్లు, డీఏలు విడుదల చేశామని, కారుణ్య నియామకాలు చేపట్టి కొత్త ఉద్యోగాల భర్తీ ప్రారంభించామని చెప్పారు. కొత్త బస్సుల కొనుగోలు కూడా కొనసాగుతోందన్నారు. గతంలో విధుల నుంచి తొలగించబడిన ఉద్యోగులను తిరిగి సేవల్లోకి తీసుకున్నామని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 10 వేల ఆర్టీసీ బస్సులు ప్రతిరోజూ సుమారు 30 లక్షల కిలోటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ నగరంలో కొత్తగా 375 రూట్లలో బస్సులు నడుపుతూ ప్రతిరోజూ అదనంగా 7 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నామని, అవసరమున్న ప్రాంతాల్లో మరిన్ని సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తోందని, గతంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు కొత్త రేషన్ కార్డులు జారీ చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మహిళలకు చీరల పంపిణీ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించడం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారిని సాధికారత దిశగా నడిపిస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ప్రజల ఆకాంక్షల కోసం రాజీనామా చేసి పోరాటం చేసిన రోజుల్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.

•రిళిడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు ట్రాఫిక్, రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని మంత్రులు పిలుపునిచ్చారు. రవాణా శాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు

# రెండున్నరేళ్ల పాలనలో 8 లక్షల ఇళ్ల మంజూరు

- రెవెన్యూ, హౌసింగ్ మంత్రి పొంగులేటి
- వనపర్తి, గద్వాల నియోజకవర్గాల్లో ప్రగతి పనులకు శ్రీకారం

**వనపర్తి/గద్వాల/హైదరాబాద్ :**

రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో రూ.8.5లక్షల కోట్ల అప్పును ప్రజలపై మోపితే నేటి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రెండున్నరేళ్లలో ఎనిమిది లక్షల ఇళ్లను మంజూరు చేసిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తొలి విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు 2.5లక్షల ఇళ్లు, 'క్యూర' పరిధిలో లక్ష ఇళ్లతో కలిపి మొత్తం ఎనిమిది లక్షల ఇళ్లను నిర్మిస్తోందని వివరించారు. వనపర్తి, గద్వాల జిల్లాల్లో సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి కృష్ణారెడ్డిలతో కలిసి తహసీల్దార్ కార్యాలయ భవనం, వెంకటేశ్వర ఆలయాలకు మంత్రి పొంగులేటి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ముఖ్య అతిథి□గా మంత్రి పొంగులేటి దివంగత నేత రాజశేఖరరెడ్డి 77వ జయంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా తాము ప్రజలను మోసపుచ్చకుండా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. రూపాయి లంచం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణ కార్యక్రమాలు సాగుతున్నాయని గుర్తు చేశారు. తొలి విడత మంజూరు చేసిన ఇళ్లలో ఇప్పటికే 1.35 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు జరిగాయని మరో 1.25 లక్షల ఇళ్లు శ్లాబులను పూర్తి చేసుకోగా మిగిలిన ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని చెప్పారు. రెండో విడత ఇళ్ల మంజూరు ప్రతి నియోజకవర్గానికి 1500 ఇళ్లతోపాటు పూరి గుడిసెల స్థానే పక్కా ఇళ్ల కోసం 500 చొప్పున మంజూరు చేశామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాగుతున్న ప్రగతిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు రోడ్లపై పడి విషం చిమ్ముతున్నారని, మతి భ్రమించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈనెల 10 ఖమ్మం జిల్లాలో రైతులకు రూ.9300 కోట్ల విడుదలకు సంబంధించి కార్యక్రమం జరుగుతుందని, నాడు వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్ మాటలకు భిన్నంగా నేడు రైతే రాజు అనే నినాదంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. వనపర్తిని దత్తత తీసుకుంటానని గతంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నానన్నారు. ఇక్కడ ప్రెస్ క్లబ్‌కు భవనాన్ని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో సుమారు 32వేల పూరి గుడిసెలు ఉన్నట్లు గుర్తించామని, వనపర్తి నియోజకవర్గంలో ఒక్క గుడిసె లేకుండా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మించుకునే పేదలకు ఇసుక, మట్టి సేకరణ విషయంలో ఎలాంటి ఆటంకం కలిగించవద్దని పోలీసు, రెవెన్యూ, హౌసింగ్ అధికారులకు ఆదేశించారు. సాదాబైనామాలకు సంబంధించి రైతు పొజిషన్‌లో ఉంటే వాటిని రెగ్యులరైజ్ చేయాలని, దీనికి సంబంధించి అవసరమైతే సీసీఎల్ఏ అనుమతి తీసుకోవాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు.

**ఎన్నికలు ఎప్పుడైనా వార్ వన్ సైడే**

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వార్ వన్ సైడేనని, మళ్ళీ అధికారంలోకి వచ్చేది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో జరిగిన అన్నిఎన్నికల్లో బీఆర్ఎస్ కి ప్రజలు బుద్ధి చెప్పడంతోపాటు, ప్రజా ప్రభుత్వానికి ప్రజల దీవెనలు అందించారన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ర్యాలంపాడు గ్రామంలో జరిగిన సామూహిక ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో సహచర మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేసుకున్న లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపి వారికి ఆత్మీయ చిరు కానుకలను అందించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత మంజూరు పత్రాలను లబ్దిదారులకు పంపిణీ చే శారు. గద్వాల జిల్లా ప్రజలు చూపించిన అభిమానం మరువలేనిదన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా పేదలైతే అయితే చాలు ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. జూరాల, నెట్టంపాడు ముంపు భూ నిర్వాసితులకు కూడ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం. రెవెన్యూ శాఖ పరిధిలోని గద్వాల జిల్లా కావాల్సిన ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాలను కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం.పేదల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే ప్రజాప్రభుత్వం అని మంత్రి తెలిపారు.

# కేంద్రంపై నెపం నెట్టడం తగదు

**న్యూఢిల్లీ, జూలై 8 :**

తెలంగాణలో 53 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినా కానీ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో విఫలమైందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి దిల్లీలో విలేకరుల సమావేశంలో ఆరోపించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు విషయంలో సరైన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సి ఉండగా అన్ని రకాలుగా ఇబ్బందులు ఉన్నాయన్నారు. గన్నీ బ్యాగులు, గోడౌన్లు లేవు.. రైసు మిల్లుల వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో రైతులు తీవ్రంగా ఆందోళనలు వ్యక్తం చేస్తూ రోడ్లపైకి వచ్చారని తెలిపారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉద్యమం చేసిన తర్వాత ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. కేవలం ధాన్యాన్ని సేకరించడమే కాదు.. ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఆ బియ్యాన్ని ఎఫ్‌సీఐలకు చేర్చాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి అన్ని రకాల ఖర్చులకు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రమే డబ్బులు చెల్లిస్తోందన్నారు. 202425 ఖరీఫ్‌లో 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, ఎఫ్‌సీఐకు జమ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు కనీసం 13 శాతం కూడా పూర్తి చేయలేదని ధ్వజమెత్తారు. 202425 రబీ సీజన్‌లో కూడా ఇదే పరిస్థితి ఉందని, 202526 ఖరీఫ్‌కు సంబంధించి 45 శాతం బియ్యం ఎఫ్‌సీఐకి చేరలేదని, 2526 రబీ సీజన్‌కు 90 శాతం బియ్యం పరిస్థితి ఇలాగే ఉందని వెల్లడించారు. గతంలో బీఆరఎస్ ప్రభుత్వం కూడా ఇలాగే వ్యవహరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టడమే తప్ప కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసే విషయంలో రాష్ట్రం శ్రద్ధ చూపించలేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇలాగే వ్యవహరిస్తోందన్నారు. గత 12 ఏళ్లలో ధాన్యం కొనుగోలుకు నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్సీడీసీ) ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1.16 లక్షల కోట్లు రుణాలను అందజేసిందని, 202526లో ధాన్యం సేకరణ కోసం రూ.37 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం ఎన్సీడీసీ ద్వారా అందజేసిందని, ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.22,700 కోట్లను మంజూరు చేసిందని వివరించారు. రాష్ట్ర రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉదారంగా నిధులను అందజేస్తోందని తెలిపారు. కానీ, రైతుల సమస్యలపై దిల్లీలో ధర్నా చేయాలని కేటీఆర్ పిలుపునిస్తున్నారంటూ బీఆరఎస్, కాంగ్రెస్‌లు కలిసి ధర్నాకు వస్తే నిజాలేంటో మీకు తెలియజేస్తాం అన్నారు. గాలి మాటలు మాట్లాడటం బీఆరఎస్, కాంగ్రెస్‌లకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ రాష్ట్రాలకు నిధులు అందజేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ప్రభుత్వాలు వస్తాయి.. పోతాయి కానీ రైతుల ధాన్యం కొనుగోలు, గోడౌన్లకు సంబంధించి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేశారు. రైస్ మిల్లుల్లో మిల్లింగ్ కోసం ఇలాంటి వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాల్సిందిపోయి అనవసరమైన రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్–బీజేపీ 'కోల్' వార్..!

మొదటిపేజీ తరువాయి

వాదన ప్రకారం తాడిచెర్ల2 బొగ్గు బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం 2013లోనే అధికారికంగా సింగరేణికి కేటాయించింది. ఇప్పుడు ఇచ్చింది కొత్త కేటాయింపు కాదని, కేవలం పెండింగ్‌లో ఉన్న మైనింగ్ లీజు, ఇతర అనుమతుల ప్రక్రియ మాత్రమేనని ఆయన స్పష్టం చేస్తున్నారు. 2021లోనే సింగరేణి లీజు కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం చాలా కాలం ఫైళ్లను పెండింగ్‌లో ఉంచిందని, రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు ఒత్తిడి తీసుకురావడంతోనే అనుమతులు లభించాయని కాంగ్రెస్ చెబుతోంది.

**కేంద్రం వాదన ఇదే**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాత్రం కేంద్ర ప్రభుత్వం సింగరేణి అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తోందని పేర్కొంటున్నారు. తాడిచెర్ల2కు అవసరమైన అనుమతులు కేంద్రం ఇచ్చిందని, కేంద్రంపై ఆరోపణలు చేయడం సరికాదని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పన, గనుల అభివృద్ధి, ధాన్యం కొనుగోలు వంటి అంశాల్లో వైఫల్యాలను కేంద్రంపై నెట్టే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు.

**సింగరేణి రాజకీయ అస్త్రమా?**

తెలంగాణలో సింగరేణి కేవలం ప్రభుత్వ రంగ సంస్థ మాత్రమే కాదు.. లక్షలాది కార్మిక కుటుంబాల జీవనాధారం, ఉత్తర తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు కీలక ఆధారం. అందువల్ల సింగరేణికి సంబంధించిన ప్రతి నిర్ణయం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంటోంది. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి ప్రయోజనాల పరిరక్షణ పేరుతో కేంద్రంపై ఒత్తిడి పెంచుతుండగా, బీజేపీ మాత్రం తామే సంస్థ అభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటున్నామని ప్రజలకు చెప్పే ప్రయత్నం చేస్తోంది.

**కోయగూడెం, సత్తుపల్లి బ్లాక్‌లపై కొత్త డిమాండ్**

భట్టి విక్రమార్క మరో అడుగు ముందుకేసి కోయగూడెం బ్లాక్3, సత్తుపల్లి బ్లాక్3 గనులను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గతంలో ప్రైవేటు సంస్థలకు బ్లాక్‌లు కేటాయించడం వల్ల ఆశించిన ఫలితాలు రాలేదని, ప్రభుత్వ రంగ సంస్థకే ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్ వాదిస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

**రాజకీయంగా ఎవరికీ లాభం?**

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణలో తమ రాజకీయ ఆధిపత్యాన్ని మరింత బలపరచుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో సింగరేణి, బొగ్గు గనులు, కార్మికుల ప్రయోజనాల అంశాలు రాజకీయ ప్రచారంలో ప్రధాన అస్త్రాలుగా మారుతున్నాయి. ఒకవైపు కాంగ్రెస్ కేంద్రం తెలంగాణకు అన్యాయం చేస్తోందని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చూస్తుంటే.. మరోవైపు బీజేపీ అభివృద్ధి, అనుమతులు, పెట్టుబడుల అంశాలను ముందుకు తెస్తోంది.

**'కోల్ వార్' మరింత ముదిరేనా?**

తాడిచెర్ల2 బ్లాక్ వివాదంతో ప్రారంభమైన ఈ మాటల యుద్ధం ఇక కేవలం ఒక బొగ్గు బ్లాక్‌కే పరిమితం కాకుండా సింగరేణి భవిష్యత్, బొగ్గు గనుల కేటాయింపులు, కేంద్ర-రాష్ట్ర సంబంధాల వరకు విస్తరించే సూచనలు కనిపిస్తున్నాయి. రాజకీయంగా కీలకమైన తెలంగాణలో కాంగ్రెస్-బీజేపీ మధ్య కొనసాగుతున్న ఈ 'కోల్ వార్' రానున్న రోజుల్లో మరింత వేడెక్కే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# మావోయిస్టులు లేకపోవడంతో గంజాయి పెరిగింది

- సరిహద్దు జిల్లాలపై గట్టి నిఘా
- ఈగల్ తరహాలో టీ-మాస్ బ్యూరో
- నేరస్తులకు శిక్ష పడే విధంగా చర్యలు
- అవినీతి పోలీసులను సహించం
- రాష్ట్ర డీజీపీ ఆనంద్

**ఖమ్మం, జూలై 7 :**

అడవుల్లో మావోయిస్టులు లేకపోవడంతో గంజాయి సాగు, రవాణా పెరిగిందని సరిహద్దు రాష్ట్రాల నుంచి తెలంగాణ జిల్లాల్లో ప్రవేశించకుండా గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు పోలీస్ బాస్ సీవీ ఆనంద్ అన్నారు. అందుకే ఆదిలాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల పర్యటనలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ లో పోలీస్ అధికారులతో మంగళవారం సమీక్ష అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత మూడేళ్ళ లో జరిగిన నేరాలు వాటి నివారణ తదితర అంశాలపై ఎస్ఐ, ఆపై స్థాయి అధికారులతో జిల్లా పర్యటనలో నేరుగా సమీక్షిస్తున్నట్లు వివరించారు. లా అండ్ ఆర్డర్ ఎలాగూ ఉంటుందని, ప్రధానంగా మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, రహదారి ప్రమాదాలపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ప్రజలు కోరుకునే విధంగా ఇకనుంచి రాష్ట్రంలో బేసిక్ పోలీసింగ్ (చేతిలో లాఠీ, సాయుధ సిబ్బంది) ఉంటుందన్నారు. నేరస్తులతో ఎట్టి పరిస్థితుల్లో ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండదన్నారు. పోలీస్ స్టేషన్లలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఎస్ హెచ్ ఓలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. నేరస్తులను అరెస్ట్ చేయడంతో పోలీసుల పని అయిపోలేదని, వారికి శిక్ష పడే విధంగా కేసు నడపాల్సిన బాధ్యత కూడా ఉందని అన్నారు. నిందితులకు శిక్షలు పడే విధంగా మెజిస్ట్రేట్లతో పోలీసు అధికారులు సత్సంబంధాలు ఏర్పరచుకుని, సరైన సాక్ష్యాధారాలు సమర్పించాలని, కోర్టుకు హాజరు కావాలని డీజీపీ సూచించారు. అవినీతి పోలీసులను సహించమని, ఒళ్ళు దగ్గర పెట్టుకొని పని చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల కట్టడికి ఉన్న ఈగల్ టీం తరహాలో రహదారి సేఫ్టీ, ప్రమాదాల నివారణ కోసం టీమాస్ బ్యూరో త్వరలో ప్రారంభిస్తామన్నారు. డ్రైవింగ్ సీటు బెల్ట్ మాదిరిగా వెనుక కూర్చున్న వారు కూడా సీటు బెల్ట్ ధరిస్తే ప్రమాద మృతుల శాతం సగం తగ్గుతుందన్నారు. రాష్ట్రంలో 4.5 కోట్ల జనాభా ఉంటే సుమారు 93 వేల మంది పోలీసులు ఉన్నారని, 0.16 శాతమని ఎంత అదృష్టం ఉంటే ఈ జాబ్ వస్తుందనే విషయాన్ని పోలీస్ అధికారులు, సిబ్బంది గుర్తించాలన్నారు. జీతాలతోనే సమాజంలో గౌరవంగా బతకాలన్నారు. మావోయిస్టులను లేరని, వారి కట్టడి కోసం ఉన్న 1100 మంది పోలీస్ దళాలను 500 మందిని మాత్రమే ఇతర విభాగాలకు వినియోగిస్తున్నామని చెప్పారు. మరి కొంత కాలం లొంగిపోయిన లేదా ఇతర మావోయిస్టులపై నిఘా కొనసాగుతుదన్నారు. పగలు , రాత్రి విజబుల్ పోలీసింగ్ పెంచుతామన్నారు. దొంగతనాలు, రౌడీయిజానికి పాల్పడే అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**జిల్లా పోలీసులకు ప్రశంసలు**

జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని డీజీపీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు. మాదక ద్రవ్యాల నిరోధం, ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణా, సైబర్ క్రైం నేరాల దర్యాప్తులో ఇక్కడి పోలీసుల పని తీరుకు కితాబిచ్చారు.మొత్తంగా అనేక అంశాల్లో ఖమ్మం పోలీసు తీరు ముందంజలోనే ఉందని డీజీపీ తెలిపారు. ఖమ్మంలో రాత్రి దొంగతనాలు పెరిగాయన్నారు. విలేకరుల సమావేశంలో ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఏసీపీ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

**మాదకద్రవ్యాలపై యుద్ధం చేయాలి...**

**యువతను కాపాడాలి**

జిల్లాల పర్యటనలో భాగంగా డీజీపీ ఆనంద్ మంగళవారం ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌ను సందర్శించి నేరాల నియంత్రణ, శాంతిభద్రతలు, రోడ్డు భద్రత, సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌పై సమగ్ర సమీక్ష నిర్వహించారు. బ్యాక్ టు బేసిక్స్ అనే సందేశాన్ని ఇస్తూ నిజాయతీ , ప్రజలకు కనిపించే పోలీసింగ్ , నిష్పాక్షికత , సాంకేతికత ఆధారంగా బలమైన, సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని సూచించారు. డీజీపీ రోడ్ సేఫ్టీ పార్కును ప్రారంభించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 250 సీసీటీవీ కెమెరాలను కమాండ్ సెంటర్‌కు అనుసంధానించిన వ్యవస్థను ప్రారంభించారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించిన పోలీసు సిబ్బందిని అభినందించారు. పోలీసు సిబ్బంది, ప్రజలకు హెల్మెట్లు పంపిణీ చేసి రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలని సూచించారు. వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో పోలీసుల భాగస్వామ్యం ఉండాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటులో సహకరించిన ప్రజలను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామాలు, విద్యాసంస్థల్లో యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా సమాజమంతా అప్రమత్తంగా ఉండాలని, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం బాధ్యతాయుతంగా పోలీసులకు అందించాలని కోరారు. మాదకద్రవ్యాలపై యుద్ధం చేయాలి.. భావితరాలను కాపాడాలి అని స్పష్టం చేశారు. రాత్రి గస్తీని మరింత బలోపేతం చేసి ఆస్తి నేరాలను అరికట్టాలని, సీసీటీఎన్ఎస్ లో సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. పేదలు, బలహీనవర్గాలకు చట్టప్రకారం న్యాయం చేయాలని, సివిల్, భూ వివాదాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీలు)ను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఇసుక, మట్టి మాఫియా, రౌడీషీటర్లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ 3.0, హాక్ ఐ 3.0, టీజీ కాప్స్ 3.0 వంటి సాంకేతిక వేదికలను సమర్థంగా వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం పోలీస్ కమిషనర్ జిల్లా పోలీసింగ్, నేరాల ధోరణులు, సాంకేతిక ఆధారిత పోలీసింగ్, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమీక్షలో ఫైనాన్స్ ఫ్రాడ్ కేసులు 30 శాతం, ఉద్యోగ మోసాల కేసులు 36 శాతం పెరిగినట్లు వెల్లడించారు. నకిలీ పత్రాలు, జీఎస్టీ సంబంధిత నేరాలు కూడా పెరుగుతున్నాయని వివరించారు. సైబర్ నేరాల పరంగా జూన్ 2026 నాటికి 711 కేసులు నమోదయ్యాయని, బాధితులు రూ.9.48 కోట్లు కోల్పోయారని, అందులో రూ.1.41 కోట్లు తిరిగి అందించినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా 2026లో 1,700 కిలోల గంజాయి, 2025లో సుమారు 4,000 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు కమిషనర్ వివరించారు. రాష్ట్రంలో అత్యధిక గంజాయి స్వాధీనం నమోదవుతున్న కమిషనరేట్లలో ఖమ్మం ఒకటిగా నిలిచిందన్నారు.

# చంద్రబాబు కోసమే గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు

మొదటిపేజీ తరువాయి

భవన్‌లో మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ ధర్మసాగర్, రామప్ప చెరువులు ఖాళీగా ఉంటే ఎందుకు నింపడం లేదన్నారు. కాళేశ్వరం కింద ప్రాజెక్టుల్లో నీళ్లు నింపి రైతులకు ఇవ్వాలని ఎందుకు అనుకోవడం లేదన్నారు. ఈ రోజు కూడా సమ్మక్క సాగర్ బ్యారేజీలో 1,08,000 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. దేవాదుల ప్రాజెక్టు అన్ని ఫేజులు కలిపి ఒక్కరోజులో 2,542 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయ వచ్చన్నారు. సాధారణంగా దేవాదుల మోటర్లు 71 మీటర్ల నీళ్లు ఉంటే పనిచేస్తాయి., కానీ ఇప్పుడు 75 మీటర్ల నీళ్లు ఉన్నాయి.. అంటే నీళ్లు ఉండి కూడా కావాలని ఎత్తిపోయడంలేదని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో సగానికి పైగా మోటార్లు అసలు ఆన్ చేయలేదు. నిర్లక్ష్యం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 80శాతం చెరువులు ఎండిపోయి ఉన్నాయన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొద్దని నిపుణులు ఎక్కడా చెప్పలేదని.. అక్కడ బ్యారేజ్ నిర్మించేందుకు అనుకూలంగానే ఉందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీష్ రావు స్పష్టం చేశారు. మేడిగడ్డ నుండి 160టీఎంసీల నీళ్లు మిడ్ మానేరు తీసుకువెళ్లేందుకు పరిస్థితులు అనుకూలిస్తాయా లేదా అన్న దాని గురించి కమిటీ వేశారని రిటైర్డ్ ఇంజనీర్లు చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్‌కు కూడా ఈ రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొచ్చు కానీ నేరుగా మిడ్ మానేరుకు నీరు తీసుకెళ్లడం సాధ్యం కాదని ఆనాడు కమిటీ చెప్పింది. కమిటీ సూచనల మేరకు నేరుగా నీళ్లు తరలించే ప్రతిపాదనను బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపసంహరించుకుందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ పీసీ ఘోష్ కమిషన్‌కు నివేదిక ఇచ్చిందన్నారు. తాము చెప్పినట్టే బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని అఫిడవిట్ రూపంలో పీసీ ఘోష్ కమిషన్‌కు రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ తెలిపింది. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ రిపోర్టు పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. మేడిగడ్డ దగ్గర చిన్న రబ్బర్ డ్యామ్ వేసి మోటార్లు ఆన్ చేసి కాళేశ్వరం నీళ్లు వాడుకోవచ్చని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంజనీర్లు ఒక రిపోర్ట్ ఇచ్చారని, ఉత్తమ్ కుమార్ రెడ్డి.. నీకు చిత్తశుద్ధి ఉంటే ఆ రిపోర్ట్ బయట పెట్టాలని హరీష్‌రావు సవాల్ విసిరారు. ఆ రిపోర్ట్ ఇచ్చిన వారం రోజుల్లోనే ట్రాన్స్‌ఫర్ చేసి పోస్టింగ్ ఇవ్వకుండా రిటైర్ చేశారు. మీకు కాళేశ్వరం అంటే అంత పగ, ప్రతీకారం ఎందుకని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెగిటివ్ మైండ్‌సెట్‌తో ఉన్నారని వ్యాఖ్యానించారు. కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయమంటే ఎన్‌డీఎస్ఏ సాకు చెబుతున్నారని, మరి సమ్మక్క బ్యారేజీ మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ నిమిషానికి సమ్మక్క బ్యారేజీ దగ్గర లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉందని చెప్పారు. గోదావరి నీళ్లు తీసుకోవాలన్న కనీస సోయి లేదని విరుచుకుపడ్డారు. చెరువులు నింపుకునే అవకాశం ఉన్నా నింపడం లేదన్నారు. దేవాదుల మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని తెలిపారు. మోటార్లు ఆన్ చేయకుండా.. నీళ్లను దిగువకు వదులుతున్నారని అన్నారు. కాంగ్రెస్‌ది నేరపూరిత నిర్లక్ష్యమని మాజీ మంత్రి విమర్శలు గుప్పించారు. నీళ్లు ఉండి కూడా లిఫ్ట్ చేయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ అంటూ వ్యాఖ్యానించారు. ఇందుకు రేవంత్, ఉత్తమ్‌ను ఉరితీసినా తప్పులేదన్నారు. నిన్నటి రేవంత్ ప్రసంగంలో సొల్లు తప్ప నిజం లేదని అన్నారు. తుమ్మిడిహెట్టికి అనుమతులున్నాయని అబద్ధాలు చెప్పారని, అనుమతులుంటే తట్టెడు మట్టి ఎందుకు తీయలేదని నిలదీశారు. ఎనిమిదేళ్లు కేంద్రం, రాష్ట్రం, మహారాష్ట్రలో అధికారంలో ఉండి ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. పనులు చేయకుండా తుమ్మిడిహెట్టి పేరిట రూ.2,328కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నీటి పారుదల మంత్రిగా ఉత్తమ్, సీఎంగా రేవంత్ విఫలం అంటూ వ్యాఖ్యానించారు. 'తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర అనుమతి ఇచ్చి ఉంటే అగ్రిమెంట్ బయటపెట్టాలి. .ఒప్పందం బయటపెడితే రాజీనామాకు సిద్ధం. లేకపోతే సీఎం రేవంత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు సవాల్ విసిరారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణం చెల్లించాలి

మొదటిపేజీ తరువాయి

చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, పథకాన్ని రద్దు చేసే ప్రయత్నాలు జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర రాజకీయ పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య -భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై బుధవారం అఖిలపక్ష సమావేశం జరిగింది. బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ ఎల్. రమణ, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, టీజేఎస్ నేత నిజ్జన రమేష్ తదితరులు హాజరయ్యారు. సమావేశంలో మాట్లాడిన జాజుల శ్రీనివాస్ గౌడ్, ప్రభుత్వం కావాలనే ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలును నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఫీజుల బకాయిల కారణంగా వేలాది మంది పేద విద్యార్థులు ఇంజినీరింగ్ ప్రవేశాల్లో పాల్గొనలేకపోయారని, ఇప్పటికే పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడినా ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల హక్కుల కోసం ఈ నెల 20న హైదరాబాద్‌లో విద్యార్థుల మిలియన్ మార్చ్ నిర్వహిస్తామని ప్రకటించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి ఉన్నత విద్య కీలకమని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెం ట్ అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ అనిశ్చితిలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత విద్య పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధన కోసం చేపట్టే ఉద్యమానికి తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎల్. రమణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా ఇతర ప్రాజెక్టులపై భారీగా ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. 10న వామపక్ష విద్యార్థి సంఘాలు చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌కు తమ పార్టీ మద్దతు ఉంటుందని ప్రకటించారు. టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడడం సరికాదని అన్నారు. బీసీ విద్యార్థుల ఉద్యమానికి తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘాలు, బీసీ సంక్షేమ సంఘాలు, మహిళా, యువజన, మేధావుల సంఘాల ప్రతినిధులు పాల్గొని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యాం కుర్మా, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరసింహ నాయక్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తారకేశ్వరి, బీసీ మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రమేష్, కౌలే జగన్నాథం, వరుణ్ కుమార్, నాయకులు సత్యరాజ్ గౌడ్ గౌతమి, దేవిక, ఇంద్రమ్ రజక, మీసాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.





# కాళేశ్వరం కథ.. కంచికి చేరేదెలా?

## రాజకీయ ఆరోపణలతో కాలం గడిచింది... ఇప్పుడు పరిష్కారమే ముఖ్యం

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎడతెగని పంచాయితీతో నష్టపోతున్నది రాష్ట్రప్రజలే. కాంగ్రెస్, బిఆర్ఎస్ ల మధ్య పంచాయితీ కారణంగా నీటిని కోల్పోతున్నాం. ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునేలా చేసుకుని ముందుకు సాగడమే ఉత్తమం. అంతే తప్ప మళ్లీ తుమ్మడిహట్టి వద్ద కొత్త ప్రాజెక్ట్ అంటూ ప్రజాధనం వృధాచేయడం ఎంతమాత్రం సరికాదు. మేడిగడ్డ రిజర్వాయర్‌ను బాగు చేసుకోవడం, నీటిని వాడుకోవడం మినహా మరో గత్యంతరం లేదు. నిజానికి ఇక్కడ ప్రాజెక్ట్ నిర్మాణం కన్నా మించి ఖర్చు చేశారన్నది వాదన. అందుకు సంబంధించి మాత్రమే విచారణ సాగాలి. నిధులు దుర్వినియోగం జరిగితే నిలదీయాలి. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు ముందుకు సాగాలి. దీన్ని ఇంకా తవ్వుతూ పోవడం వల్ల ఉపయోగం ఉండదన్నది గత రెండున్నరేళ్లుగా చూస్తున్నాం. నది తప్పు అంటే ..నీది తప్పు అంటూ ఇరు పార్టీల నేతలు పరస్పరం విమర్శించుకుంటూ..ఇది వారిద్దరి గొడవగా మార్చారు. ఇది ప్రజల సమస్య. తెలంగాణ ప్రజల సమస్య. ఖర్చు పెట్టిన డబ్బుకు న్యాయం చేయడం ముఖ్యం. అలాగే అవినీతి జరిగితే దానిపై పోరాడాలి. రెండున్నరేళ్లు గడిచినా ఇంచుమందం కూడా చర్య తీసుకోలేదు. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఉపయోగించుకునేందుకు ఏంచేస్తే మంచిదో అదే చేయాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలతో కాలం వృధా చేయరాదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరినా ఆయన సమాధానం చెప్పడని తేలిపోయింది. అసెంబ్లీలో గతంలోనూ చర్చ సాగింది. మరిన్ని చర్చలు చేయాలనుకోవడం సరికాదు. చర్చ కేవలం అవినీతిపైనే జరగాలి. కాళేశ్వరంలో ఎంతమేర అవినీతి జరిగిందన్నదే ముఖ్యం. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా, రావడానికి కెసిఆర్ సిద్దంగా లేరు. ఇది జరగమెరిగిన సత్యం. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ అన్నది, అవినీతిపైనే సాగితే మంచిది. కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను చేపట్టాలి. అలా చేసినా ఉపయోగామా లేదా అన్నది ఆలోచన చేయాలి. లక్షకోట్లను ఖర్చు చేశారు కనుక దానితో నీటిని ఉపయోగిం చుకునే శక్తి ఉంటుందా లేద అన్నది నిపుణులతో చర్చించాలి. కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయకపోవడం వల్లే అది నిరూపయోగంగా మారింది. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయాలని నిపుణుల కమిటీ చెప్పిందంటున్న సిఎం రేవంత్, దానిని ఎలా వయబుల్ చేస్తారో ప్రజలకు తెలియ చేయాలి. అంతే తప్ప మళ్లీ తుమ్మడిహట్టి అంటూ ప్రజలను మరోమారు ప్రాజెక్టుల పేరుతో ముంచరాదు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా కాంగ్రెస్ చిత్తశుద్ధిని చాటుకోవాలి. కాళేశ్వరంలో ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా కూలిపోతాయని అంటున్నారు. భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అది నిజమే అయితే న ఇపుణుల కమిటీ నివేదికలను బయటపెట్టాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకుండానే.. తాము అధికారంలోకి వచ్చాక వేల కోట్ల అప్పులు కట్టాల్సి వచ్చిందని సిఎం రేవంత్ అంటున్నారు. ఇదే సందర్భంలో అప్పులను తగ్గించుకోవడం, ఉచిత పథకాలను సమీక్షించడం కూడా చేయాలి. అదేపనిగా అప్పులు చేస్తూ పోతే రాష్ట్రం భరించే శక్తి కోల్పోతుందని గుర్తించాలి. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని చెబుతున్న రేవంత్ రెడ్డి ముందుగా ఆ పని చేయాలి. ఇప్పటికే ఎల్‌నినో వల్ల వర్షాలు వెనక్కి పోయాయి. గోదావరిలో ఇప్పుడే కొద్దిగా న ఈరు వస్తోంది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు నీరు వస్తోంది. దీనిని ఒడిసి పట్టుకుని చెరువులు, ప్రాజెక్టులు నింపుకుంటేనే రైతులకు నీరు అందుతుంది. తాగునీటికి పరిష్కారం దక్కుతుంది. కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదు. ప్రజా సొమ్ము గోదారి పాలు కాకుండా కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి అందుకు అనుగుణంగ ఆనడచుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ఇంకా చర్చించడం వల్ల లాభం లేదు. నిత్యం అదే విషయం ప్రస్తావించకుండా ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని సీఎం రేవంత్ విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. అదే నిజమయితే ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై పోరాడాలి. నిధులు ఎక్కడ దారి మళ్లాయో గుర్తించాలి. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమల కు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పడం ఇప్పుడు సాధ్యం అయ్యే పనికాదు. తుమ్మడి హట్టికి మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యంతరాలు వచ్చాయి కనుకనే మహారాష్ట్ర దీనికి అంగీకరించలేదు. విభజనకు ముందే ఈ పనిచేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేకపోయింది. ఏది ఏమైనా అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ అబద్ధాలతో మభ్యపెట్టడం ద్వారా ప్రజాధనాన్ని వృధా చేయరాదు. కాళేశ్వరానికి ఇక ఒ మంచి ముగింపు తీసుకుని రావడం ఉత్తమం.

# పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న అగ్గి

- ఇరాన్, అమెరికాల మధ్య పరస్పర దాడులు
- అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ ప్రతిదాడులు
- బహ్రెయిన్, కువైట్‌లపై దాడులు





**టెహ్రాన్, జులై 8:** పశ్చిమాసియాలో మళ్లీ అగ్గి రాజుకుంటోంది. పశ్చిమాసియా మరోసారి నిప్పుల కొలిమిగా మారింది. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో గల్ఫ్ దేశాల్లో సైరన్ల మోత మోగుతోంది. అగ్రరాజ్య దాడులపై తీవ్రంగా మండిపడ్డ టెహ్రాన్.. ప్రతీకార దాడులు మొదలుపెట్టింది. బహ్రెయిన్, కువైట్‌లో అమెరికాకు చెందిన 85 సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు ప్రయోగించింది. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులకు ప్రతిస్పందనగా.. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలపై అమెరికా వైమానిక దాడులు చేసింది. దీనిపై ఐఆర్‌జీసీ తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని అగ్రరాజ్యం ఉల్లంఘించిందని ఆరోపించింది. దీనికి తాము కూడా ప్రతీకారం తీర్చుకుంటామని, అందుకే ఈ తాజా ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించింది. బహ్రెయిన్ లోని యూఎస్ ఫిఫ్త్ ఫ్లీట్, కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్ బేస్ సహా అగ్రరాజ్యానికి చెందిన 85 కీలక మిలిటరీ స్థావరాలను టా÷-గ్గ÷ట్ చేసినట్లు పేర్కొంది. వాటిపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిపింది. బుషెహర్‌లో అమెరికా అత్యాధునిక డ్రోన్ ఎంక్యూ-9ను కూల్చినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జరుగుతోన్న వేళ ఈ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం గమనార్హం. దీనిపై ఐఆర్‌జీసీ స్పందిస్తూ.. తమ చారిత్రక కార్యక్రమాన్ని మరుగున పడేసేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టింది. తాజా దాడులపై ఇరాన్ స్పీకర్ ఘాలిబఫ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వేధింపులు, బెదిరింపుల శకం ముగిసింది. ఇక మేం తలొగ్గబోం. అమెరికా తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడుతోంది. ఆ దేశం ఎంత ఒత్తిడి చేసినా.. టెహ్రాన్ లొంగిపోదని రాసుకొచ్చారు. ఇరాన్‌పై ఈసారి అతిపెద్ద దాడి జరిపినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. దాదాపు 80కి పైగా లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేసినట్లు తెలిపింది. టెహ్రాన్ కమాండ్, కంట్రోల్ నెట్‌వర్క్‌లు, కోస్టల్ రాడార్ సైట్లు, యాంటీ షిప్ మిసైల్ సామర్థ్యాలు, గగనతల రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. ఈ దాడుల్లో ఐఆర్‌జీసీకి చెందిన 60 చిన్న బోట్లు ధ్వంసమైనట్లు వెల్లడించింది. కాగా.. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాటో శిఖరాగ్ర సదస్సు కోసం తుర్కియేలో ఉన్నారు. అక్కడి నుంచే ఇరాన్‌పై తాజా దాడులకు ఆయన ఆదేశాలిచ్చినట్లు సమాచారం. మొత్తంగా అమెరికా,ఇరాన్ పరస్పర దాడులతో మళ్లీ ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులు చేసింది. హర్మూజ్ జలసంధిలో మూడు వాణిజ్య నౌకలపై దాడులు జరిగిన గంటల వ్యవధిలోనే ఇరాన్ సైనిక స్థావరాలు, నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపై విరుచుకుపడింది. ఈమేరకు యుఎస్ సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. అంతర్జాతీయ జలమార్గంలో అమాయక పౌరులు ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై దాడులకు ఇరాన్ మూల్యం చెల్లించుకునేలా.. అమెరికా దళాలు ఈ దాడులు చేపట్టాయని పేర్కొంది. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలు, క్షిపణి నిల్వలు, డ్రోన్‌ల ప్రయోగ స్థావరాలను తమ సేనలు లక్ష్యంగా చేసుకున్నట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఇరాన్ నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపైనా దాడులు చేసినట్లు చెప్పారు. ఖేష్మ్, బందర్ అబ్బాస్‌లలో పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఈ దాడులకు ముందే చమురు విక్రయాలకు సంబంధించి ఇరాన్ లైసెన్స్‌ను అమెరికా రద్దు చేసింది. హర్మూజ్‌లో ఇరాన్ చర్యలు ఆమోదయోగ్యం కావని, అందుకే లైసెన్స్‌ను రద్దు చేసినట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఈ చర్యను ఇరాన్ విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. ఇది తాత్కాలిక ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. దీని పర్యవసానాలకు అమెరికా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పింది. ఇకపోతే బహ్రెయిన్, కువైట్‌పై బుధవారం ఇరాన్ దాడులు చేసింది. బహ్రెయిన్‌లో మిస్సైల్ అలర్ట్ సైరన్ మోగించారు. ఇరాన్‌పై మంగళవారం అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో.. కౌంటర్‌గా ఇరాన్ అటాక్ చేసింది. అలర్ట్ సైరన్ మోగిన వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని బహ్రెయిన్ ప్రకటన చేసింది. బహ్రెయిన్‌లో కానీ, కువైట్‌లో కానీ డ్యామేజ్ అయినట్లు ప్రస్తుతం ఎటువంటి సమాచారం లేదు. తాజాగా హోర్ముజ్ జలసంధిలో మూడు ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ దాడి చేసింది. ఆ దాడులకు బదులుగా శక్తివంతమైన రీతిలో అమెరికా ప్రతిదాడి చేసింది. సుమారు 80 టార్గెట్లను ధ్వంసం చేశామని, దీంట్లో ఐఆర్జీసీకి చెందిన 60 బోట్లు ఉన్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొన్నది. ఖాసిమ్ దీవి, బందర్ అబ్బాస్, సిరిక్ ప్రాంతాలపై దాడులు జరిగినట్లు ఇరానీ మీడియా తెలిపింది. స్థానిక ప్రజలు గాయపడినట్లు తెలిసింది. అయితే హోర్ముజ్‌లో మూడు ట్యాంకర్లపై దాడికి తామే బాధ్యులమని ఇరాన్ ఇప్పటి వరకు ప్రకటించలేదు.

# దేశవ్యాప్తంగా ఎన్ఐఏ భారీగా సోదాలు

- ఇస్లామిక్ స్టేట్ ఏర్పాటు కుట్రపై దర్యాప్తు ముమ్మరం
- ఏపీ, తెలంగాణ సహా 10 రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు
- డిజిటల్ పరికరాలు స్వాధీనం



**ఢిల్లీ, జూలై 8:** దేశవ్యాప్తంగా బుధవారం నాడు జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు భారీ ఎత్తున సోదాలు నిర్వహించారు. ఐసీస్, ఏక్యూఐఎస్ ఉగ్రవాద సంస్థల కార్యకలాపాలు, వాటి ప్రచారంపై ఎన్ఐఏ దృష్టి సారించింది. భారతదేశంలో హింసాత్మక జిహాద్ ద్వారా ఇస్లామిక్ స్టేట్ (ఖలీఫత్)ను ఏర్పాటు చేసేందుకు జరుగుతున్న కుట్రపై దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దేశంలోని మరో 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీలోని మొత్తం 20 ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. సోదాల్లో భాగంగా ఉగ్రవాద ప్రచారానికి సంబంధించిన పలు కీలక డిజిటల్ పరికరాలను ఎన్ఐఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని తదుపరి విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ పరీక్షలకు పంపనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఉగ్ర కుట్ర కేసుకు సంబంధించి ఇప్పటివరకు 11 మంది నిందితులతో పాటు ఒక మైనర్ బాలుడిని (జువెనైల్) అదుపులోకి తీసుకున్నట్లు ఎన్ఐఏ పేర్కొంది. కాగా, ఈ ఏడాది మార్చి నెలలో విజయవాడ పోలీసులు నమోదు చేసిన ఈ కేసును, తదుపరి సమగ్ర విచారణ నిమిత్తం మే నెలలో ఎన్ఐఏకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రెహ్మతుల్లా షరీఫ్ మహ్మద్ నివాసంలో గతంలోనే ఐసీస్, ఏక్యూఐఎస్‌లకు సంబంధించిన అభ్యంతరకర ప్రచార సామగ్రి లభ్యమైంది. గతంలో స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాల సాంకేతిక విశ్లేషణ (టెక్నికల్ అనాలసిస్) ఆధారంగానే ఎన్ఐఏ అధికారులు ఈరోజు తాజా సోదాలు నిర్వహించారు. అరెస్టయిన నిందితులు దేశంలోని యువతను జిహాదీ భావజాలం వైపు మళ్లించేందుకు తీవ్రంగా ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. విదేశీ హ్యాండ్లర్లతో ఆన్‌లైన్ ద్వారా నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ, సామాజిక మాధ్యమాల వేదికగా ఉగ్ర భావజాలాన్ని వ్యాప్తి చేసినట్లు ఎన్ఐఏ గుర్తించింది. దేశాన్ని అస్థిరపరిచి 'ఖలీఫత్' స్థాపనకు కుట్ర పన్నిన మరికొందరు సూత్రధారులను గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ అధికారులు స్పష్టం చేశారు.




# బద్రీనాథ్ విరాళాల చోరీ వివాదం

## ఆలయ సిబ్బందిపై వేటు

### ప్రైవేట్ సెక్రటరీ సస్పెన్షన్, క్రిమినల్ కేసు నమోదు; రంగంలోకి హైలెవల్ కమిటీ



**డెహ్రాడూన్:** ప్రముఖ పుణ్యక్షేత్రం బద్రీనాథ్ ఆలయ విరాళాల అవకతవకల ఉదంతం కలకలం రేపుతోంది. కానుకల లెక్కింపులో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయడానికి శ్రీ బద్రీనాథ్ - కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ (దీఖుజ) ఏర్పాటు చేసిన నలుగురు సభ్యుల కమిటీ మంగళవారం నుంచే విచారణ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో, విరాళాల చోరీకి పాల్పడ్డాడన్న ఆరోపణలపై ఆలయ కమిటీ ఒక సిబ్బందిపై తక్షణమే వేటు వేసింది. ఈ వివాదంపై బీకేటీసీ చైర్మన్ హేమంత్ ద్వివేది స్పందిస్తూ.. ఆలయంలో ప్రైవేట్ సెక్రటరీగా పనిచేస్తున్న ప్రమోద్ నౌతియాల్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ప్రాథమిక విచారణలోనే విరాళాల విషయంలో అతడు తీవ్ర అక్రమాలకు పాల్పడినట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు. కాగా, సస్పెన్షన్‌కు గురైన ప్రమోద్ నౌతియాల్‌పై మంగళవారం రాత్రి బద్రీనాథ్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతీయ న్యాయ సంహిత (దీచీూ) సెక్షన్ 306, 316(5) కింద పోలీసులు అతనిపై కేసులు నమోదు చేశారు. ఆలయ విరాళాల వివాదం తీవ్రరూపం దాల్చడంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వం కూడా ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ ఆదేశాల మేరకు ముగ్గురు సభ్యులతో కూడిన హై-లెవల్ కమిటీ ఏర్పాటైంది. గర్వాల్ డివిజనల్ కమిషనర్ ఆనంద్ స్వరూప్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తుండగా.. నేషనల్ హెల్త్ మిషన్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ తివారీ, మెడికల్ హెల్త్ సర్వీసెస్ ఫైనాన్స్ డైరెక్టర్ జగత్ సింగ్ చౌహాన్ ఇందులో సభ్యులుగా ఉన్నారు. బద్రీనాథ్ ఆలయ విరాళాలు, భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపులో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, 15 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఈ కమిటీని ఆదేశించారు.

# పూణెలో కుప్పకూలిన మూడంతస్థుల భవనం

**ముంబై, జూలై 8 :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు మహారాష్ట్రను అతలాకుతలం చేస్తున్నాయి. పలు జిల్లాల్లో కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో పుణెళిలో కూడా భారీ వర్షాల కారణంగా ఓ మూడంతస్తుల భవనం కుప్పకూలి తీవ్ర కలకలం రేపింది. మోషి ప్రాంతంలోని పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌లోని మూడు అంతస్తుల కార్యాలయ భవనం ఒక్కసారిగా నేలమట్టమైంది. అధికారుల సమాచారం ప్రకారం, భవనం కూలిన సమయంలో అందులో ఉన్న 15 నుంచి 16 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండే అవకాశం ఉంది. మధ్యాహ్నం సుమారు 1.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై వెంటనే సమాచారం అందుకున్న పీసీఎంసీ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాలింపు, సహాయక చర్యల కోసం ఎన్‌డీఆర్ఎఫ్



# కాటన్ ప్రొడక్టివిటీ మిషన్ (కపాస్ కాంతి)పై అవగాహన

- పత్తి సాగుపై రైతులకు అవగాహన
- శాస్త్రీయ సాగు పద్ధతి పాటించాలి
- క్లోజర్ స్పేసింగ్ పద్ధతిలో సాగు చేయాలి
- వికారాబాద్ మండల వ్యవసాయ అధికారి జి ప్రసన్నలక్ష్మి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** బుధవారం వికారాబాద్ జిల్లా పరిధిలోని వికారాబాద్ మండలం నారాయణపూర్ రైతు వేదికలో కాటన్ ప్రొడక్టివిటీ మిషన్ (కపాస్ కాంతి) పథకం కింద రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జి ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ క్లోజర్ స్పేసింగ్ విధానంలో పత్తి సాగు చేయడం వల్ల ఎకరాకు మొక్కల సంఖ్య పెరిగి, అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు వివరించారు. అలాగే నాణ్యమైన విత్తనాల వినియోగం, సిఫారసు చేసిన దూరంలో విత్తడం, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, సమగ్ర చీడపీడల నిర్వహణ (ఐపీఎం), శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించాలని సూచించారు. వికారాబాద్ మండలానికి కాటన్ ప్రొడక్టివిటీ మిషన్ (కపాస్ కాంతి) పథకం కింద 200 ఎకరాలకు గాను 800 ప్యాకెట్లు కేటాయించబడినట్లు మండల వ్యవసాయ అధికారి ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని క్లోజర్ స్పేసింగ్ పద్ధతిలో పత్తి సాగు చేపట్టి అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని పత్తి ఉత్పాదకత పెంపునకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సి. శ్రీనివాస్, వైస్ చైర్మన్ మల్లేశం, మండల వ్యవసాయ అధికారి జి. ప్రసన్న లక్ష్మి, వ్యవసాయ విస్తరణ అధికారులు ఫర్హీన్, అయ్యప్ప, రాఘవేందర్ పాల్గొన్నారు.


# వికారాబాద్ జిల్లాకు ఎయిడ్స్ నివారణ, నియంత్రణ చికిత్సలో జాతీయ స్థాయి గుర్తింపు



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన మార్గదర్శకాలను విజయవంతంగా సాధించి జాతీయస్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాలకు అందజేసే సాక్ష్యం సర్టిఫికెట్ ను పొందడం జరిగినది. ఎయిడ్స్ రోగుల గుర్తింపు, చికిత్స నియంత్రణలో వికారాబాద్ వైద్య ఆరోగ్య శాఖ ఉత్తమ పనితీరు కనబరిచి దేశవ్యాప్తంగా కేవలం 70 జిల్లాలు మాత్రమే భారత ప్రభుత్వ, జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన మార్గదర్శకాల లక్ష్యాల మేరకు పనిచేశాయని అందులో వికారాబాద్ జిల్లా ఉండడం వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మార్గదర్శకత్వంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే సుధాకర్ లాల్, వైద్య సిబ్బంది కృషి వలన నిర్దేశించిన లక్ష్యాలను సాధించి సక్ష్యం సర్టిఫికెట్ పొందడం జరిగినదని తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాలలో భాగంగా వికారాబాద్ జిల్లాలో హెచ్ఐవి తో జీవిస్తున్న వ్యక్తుల్లో కనీసం 95 శాతం మందికి తమ హెచ్ఐవి స్థితి తెలిసి ఉండడం ఇందులో హెచ్ఐవితో జీవిస్తున్న వారిని 4536 మందిని గుర్తించడం జరిగినది. హెచ్ఐవి నిర్ధారణ అయిన వారందరికీ హెచ్ఐవి నియంత్రణ కోసం అందజేసే యాంటీ రెట్రో వైరల్ థెరపీ చికిత్స అందించడం జరిగినది. ఈ లక్ష్యం సాధించడంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఏ ఆర్ టి పరీక్ష, చికిత్స కేంద్రాలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రముఖ పాత్ర పోషించడం జరిగినది. హెచ్ఐవి ని ముందస్తుగా గుర్తించడం, హెచ్ఐవి నిర్ధారణ అయిన వెంటనే టెస్ట్ అండ్ ట్రీట్ విధానంలో యాంటీ రిట్రో వైరల్ చికిత్స ప్రారంభించడం , చికిత్స నిరంతరం కొనసాగించేలా కౌన్సిలింగ్ ఫాలో అప్ సేవలు అందించడం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించడం జరిగినది. హెచ్ఐవి తో జీవిస్తున్న ప్రతి వ్యక్తి క్రమం తప్పకుండా ఏ ఆర్ టి మందులు తీసుకోవడం ద్వారా వైరల్ లోడ్ గణనీయంగా తగ్గి ఆరోగ్యవంతమైన జీవితం గడపడంతో పాటు ఇతరులకు ఈ వ్యాధి సంక్రమణ కూడా తగ్గుతుంది. పై లక్ష్యాలను సాధించడంలో వికారాబాద్ జిల్లా విశేషంగా కృషి చేయడం వలన జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ప్రజలు హెచ్ఐవి పై ఉన్న అపోహలు, భయాలు, వివక్షను విడనాడి వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా ఐసిటిసి పరీక్షా కేంద్రంలో ఉచితంగా పరీక్షలు చేయించుకుని వెంటనే చికిత్స ప్రారంభించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చేస్తున్న కృషికి ప్రజలందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి కోరారు.

# ఘనంగా డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి

**ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన మహానుభావుడు వైయస్సార్ : గంట శివారెడ్డి**




**కుత్బుల్లాపూర్, రాజముద్ర న్యూస్:** మాజీ ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా మహాదేవపురం (277) డివిజన్ లోని డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి డివిజన్ నాయకులు గంట శివారెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైయస్సార్ ప్రజాసేవలను, సంక్షేమ పాలనను స్మరించుకొని అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత అని, రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఇలా సమాజంలోని ప్రతి వర్గం సంక్షేమమే ధ్యేయంగా అనేక ప్రజాహిత పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం జన్నారం, దండేపల్లి మండలాల్లో పాఠశాలలు, ఆశ్రమ విద్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, తహశీల్దార్ కార్యాలయాలను సందర్శించి వివిధ శాఖల పనితీరును పరిశీలించారు. జన్నారం మండలం అక్కపల్లిగూడ గ్రామంలోని మండల పరిషత్ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు జరుగుతున్న బోధన, హాజరు రిజిస్టర్లు, మధ్యాహ్న భోజన వంటశాల, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం పొనకల్ గ్రామంలోని భవిత వనరుల కేంద్రం, మండల పరిషత్ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, కవ్వాల్ గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, భోజనశాల, ప్రహరీ గోడ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జన్నారం, దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ సేవలు, వార్డులు, మందుల నిల్వలు, పరిశుభ్రతను పరిశీలించి, వైద్యులు సమయ పాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈనెల 24లోగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





# మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీఎంహెచ్‌వోగా డా. ఆనంద్ కుమార్

**డాక్టర్ ఉమా గౌరీకి రిలీవ్ ఉత్తర్వులు**

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో)గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ సి. ఉమా గౌరీని ప్రభుత్వం ఆ పదవి నుంచి రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా కారణాలతో ఆమెను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (డీపీహెచ్) కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. అదే సమయంలో, ప్రస్తుతం నిలోఫర్ ఆస్పత్రిలో సివిల్ సర్జన్, ఆర్ఎంఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె. ఆనంద్ కుమార్‌ను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీఎంహెచ్‌వోగా ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు బాధ్యతలు అప్పగించింది.

# మూడో అంతస్తు నుంచి పడి చిన్నారి మృతి



**రాజముద్ర న్యూస్ జులై 8:** పటాన్చెరులో విషాదం నెలకొంది. మూడంతస్తుల భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడిన ఏడాదిన్నర చిన్నారి అక్కడికక్కడే మృతిచెందింది. వంశికగా గుర్తించిన స్థానికులు ప్రమాదవశాత్తుపై అంతస్తు నుంచి జారిపడినట్లు చెబుతున్నారు. కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొనగా, సమాచారం మేరకు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటివరకు తమకు ఎలాంటి అధికారిక ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

# జిహెచ్ఎంసి ఉచిత సేవ ఇంటి వద్దే పికప్

**ఉప్పల్, జులై 8 (రాజముద్ర ):** హైదరాబాద్ వాసులకు శుభవార్త మీ ఇంట్లో ఉపయోగించని పాత సోఫాలు, ఫర్నిచర్, పరుపులు, కుర్చీలు, టేబుళ్లు ఉంటే బయట పడేయకండి. జిహెచ్ఎంసి వారు ఉచితంగా మీ ఇంటి వద్దకే వచ్చి తీసుకుంటారు.

**ఎలా బుక్ చేసుకోవాలి**

1. జిహెచ్ఎంసి హెల్ప్ లైన్ 155311 కు కాల్ చేయండి
2. మై జిహెచ్ఎంసి అప్ ★ లో 'భారీ వ్యర్థాల కోసం' అని సెలెక్ట్ చేయండి
3. వాట్సాప్ 9000115000 కు ఫోటో పంపండి

**గమనిక:**

- ఇది పూర్తిగా ఉచిత సేవ
- రోడ్లపైన, డ్రైన్లలో ఫర్నిచర్ పడేయవద్దు
- పర్యావరణాన్ని కాపాడుదాం

**సమాచారాన్ని అందరికీ షేర్ చేయండి, జిహెచ్ఎంసి ముఖ్య గమనిక:** భారీ వ్యర్థాల కోసం మాత్రమే ఈ సర్వీస్. రోజువారీ చెత్తకు కాదు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా సాగడం లేదు

**బీఆర్ఎస్ ఆరోపణ**



**రాజముద్ర, రామారెడ్డి న్యూస్:** రామారెడ్డి మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల ప్రధాన కార్యదర్శి సలవత్ బుచ్చిరెడ్డి అధ్యక్షతన ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రకటన చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం నియమించిన బీఎల్ఓలు ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ప్రతి అర్హత గల ఓటరికి ఎస్ఐఆర్ ఫారం అందేలా చూడాలని, ప్రజలు కూడా ఫారాలను పూర్తి చేసి తిరిగి బీఎల్ఓలకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అలా చేస్తేనే ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి ఉండదని తెలిపారు.

అలాగే, ప్రతి ఇంటికి ఫారం చేరేలా చూడడం, వాటిని నింపించి బీఎల్ఓలకు అందేలా సమన్వయం చేయడం బూత్ ఏజెంట్ల బాధ్యత అని పేర్కొన్నారు. ఒక వ్యక్తికి ఒకే చోట ఓటు హక్కు ఉండేలా ప్రజలందరూ ఈ ప్రక్రియకు సహకరించాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల యువజన అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజాగౌడ్, మాజీ సర్పంచులు ప్రభాకర్ రావు, ఉపసర్పంచ్ కిశోర్, మండల నాయకులు హన్మాండ్లు, కుక్క రాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్యదర్శులకు సర్పంచ్ లకు వి బి జి రామ్ పథకాలపై అవగాహన




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లా సర్పంచ్ లు, పంచాయతీ సెక్రటరీల శిక్షణా కార్యక్రమంలో భాగంగా బుధవారం బంట్వారం, ధారూర్, కొట్‌పల్లి, మర్పల్లి, మొమిన్ పేట్, వికారాబాద్, నవాబుపేట్ మండలాల యొక్క సర్పంచ్ లు, పంచాయతీ సెక్రటరీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో గ్రామ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ( జి పి- ఎస్ ఏపి ), వీబీ -జి రామ్ జి పథకం, సెంట్రల్ ఫైనాన్సియల్ గ్రాంట్స్ యొక్క రూల్స్, ఘన వ్యర్థాల యొక్క నిర్వహణ రూల్స్, 2026, జల సిరి,ఇతర పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ పథకాల గురుంచి చెప్పడం జరిగింది. ఇందులో భాగంగా ఉమా శంకర్ ప్రసాద్, ఐ ఏ స్, అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ మాట్లాడుతూ అందరు సర్పంచ్ లు, పంచాయతీ సెక్రటరీలు ఈ శిక్షణ లో అన్ని జాగ్రత్తగా విని అన్ని గ్రామాల్లో అమలు పరిచి అన్నిటిని ఆదర్శ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని కోరరు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను ప్రజల భాగస్వామ్యంతో తయారు చేయాలని చెప్పడం జరిగింది. ఈ శిక్షణ లో కమీషనర్ పంచాయతీ రాజ్ ఆఫీస్ యొక్క జిల్లా స్పెషల్ ఆఫీసర్ నీరజ రెడ్డి, డి.ఆర్.డి.ఓ శ్రీనివాస్, డిపిఓ జయసుధ, ఉమేష్ ఇ ఇ పి ర్ పాల్గొన్నారు.

# గుండి వంతెనపై పాలకుల నిర్లక్ష్యం వీడాలి

- గడువు దాటి 16 ఏళ్లు అవుతున్నా అసంపూర్తిగానే గుండి బ్రిడ్జ్ పనులు
- వంతెన పూర్తి చేయకపోతే 15 గ్రామాల ప్రజలతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం
- డీ వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్



**రాజముద్ర న్యూస్, ఆసిఫాబాద్ రూరల్:** జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గుండి గ్రామం వద్ద గుండి వాగుపై నిర్మిస్తున్న హై-లెవెల్ వంతెన (గుండి బ్రిడ్జ్) పనులపై పాలకుల నిర్లక్ష్యం వీడాలని డి.వై.ఎఫ్.ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. దశాబ్దాలుగా ఈ వంతెన నిర్మాణం పెండింగ్‌లో పడటం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యమని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ మండిపడ్డారు. బుధవారం గుండె బ్రిడ్జి ను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2007 లోనే 'నాబార్డ్' నిధులతో హై-లెవెల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, 2010 లోగా పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్ట్, 2026 వచ్చినా ఇంకా అసంపూర్తిగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట ₹8.50 కోట్ల వ్యయంతో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్, పాలకుల నిర్లక్ష్యం, తీవ్ర కాలయాపన వల్ల ప్రస్తుతం ₹14.40 కోట్లకు చేరిందని, కేవలం 11 పిల్లర్లు మాత్రమే నిర్మించి, స్లాబ్‌లు వేయకుండా వదిలేయడం వల్ల ప్రజాధనం వృధా అవుతోందని విమర్శించారు. వంతెన లేకపోవడం వల్ల గుండి, దాని చుట్టుపక్కల ఉన్న దాదాపు 15 గ్రామాల ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారని తెలిపారు. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించిన ప్రతిసారీ ఆసిఫాబాద్ పట్టణంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతుండటంతో, స్థానికులు నాటు పడవలు, థర్మాకోల్ తెప్పలపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి దాపురించిందని అన్నారు. అత్యవసర వైద్య సమయాల్లో గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, ప్రమాదాలకు గురైన వారిని ఆసుపత్రికి తరలించడానికి దారి లేక ప్రజలు ప్రాణాలు కోల్పోయే దౌర్భాగ్య స్థితి నెలకొందని, పాఠశాలలకు వెళ్లే చిన్న పిల్లలు, రోజువారీ కూలీల ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.రాజకీయ నాయకుల బూటకపు వాగ్దానాలతో విసిగిపోయిన గ్రామస్తులు గతంలో "వంతెన లేకపోతే - ఓటు లేదు / ఎన్నికలు లేవు" అని ఎన్నికలను బహిష్కరించినా అధికారుల్లో, ప్రజాప్రతినిధుల్లో చలనం లేకపోవడం దారుణమన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఇంచార్జ్ మంత్రులు, కలెక్టర్లు ఇచ్చిన హామీలు కేవలం నోటి మాటలకే పరిమితమయ్యాయని మండిపడ్డారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గుండి వంతెన నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, లేనిపక్షంలో 15 గ్రామాల ప్రజలను, బాధితులను ఏకం చేసి ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డి.వై.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టికానంద్, ఉపాధ్యక్షుడు దుర్గం నిఖిల్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, మరియు గ్రామ నాయకులు రాహుల్, శంకర్, దిలీప్, సావిత్రి, సోనీ, హారిక, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# 10వ రోజుకు చేరిన కోల్ మైన్స్ అధికారుల రిలే నిరాహార దీక్షలు




**రాజముద్ర న్యూస్, సత్తుపల్లి:** సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ప్రధాన గేటు ఎదుట కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 10వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 9.25 గంటల నుంచే అధికారులు దీక్షా శిబిరంలో కూర్చొని తమ నిరసనను కొనసాగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్లో ఉన్న తమ సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా జీతాల అప్గ్రేడేషన్తో పాటు ఉద్యోగుల సంక్షేమానికి కీలకమైన పీఆర్పీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఆందోళనను విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ రిలే నిరాహార దీక్షలో కెవి.అనిల్ కుమార్, డి.సూర్యప్రకాశ్, యు.సాయి శ్రవణ్ పాల్గొని సంఘీభావం తెలిపారు.

# వర్షా ల కోసం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



**రాజముద్ర న్యూస్, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం మొండికుంట గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని గ్రామ మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సకాలంలో వర్షాలు కురవాలని, చెరువులు, కుంటలు నిండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. భక్తి భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏకస్వరంతో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# రైతు భరోసా నిధుల విడుదలపై సంబరాలు

- సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ శ్రేణులు

**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా తాంసి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ పాల్గొన్నారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా నిధులను విడుదల చేసినందుకు కృతజ్ఞతగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతాంగ అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని, అన్నదాతలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తాంసి సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు, కప్పర్ల సర్పంచ్ గండ్రత్ అరుణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కౌడల సంతోష్, ఉప సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు గంగారెడ్డి, ఇచ్చోడ బ్లాక్ ఆత్మ చైర్మన్ కౌడల నారాయణ, వడ్డాడి సర్పంచ్ గంగాధర్, పలోది సర్పంచ్ నాగిరెడ్డి, పొన్నారి ఉప సర్పంచ్ రామ్రెడ్డి, కప్పర్ల ఉప సర్పంచ్ నర్సింలు, మాజీ ఎంపీపీ వన్నెల నరేష్, బోథ్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, జిల్లా కార్యదర్శి రామన్న యాదవ్, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు ధనుంజయ్, అశోక్, ఆత్మ డైరెక్టర్ గంగయ్య, మాజీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ అనుపట్ల సంజీవ్, మాజీ అధికార ప్రతినిధి ఎండీ సద్దాం, మౌలానా, చిన్న రాంరెడ్డి, నవీన్, నరేష్, గంగాధర్, హనుమండ్లు, రవి, జీవన్, చిలుకూరి వెంకటరెడ్డి, సురుకుంటి భోజరెడ్డి, నాందేవ్, మోహన్, మావల ఉప సర్పంచ్ అడెల్లు, మోసిన్, అలీం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



**రాజముద్ర న్యూస్, తాండూర్:** మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని మాదారం గ్రామ సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా బుధవారం మాదారం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరితహారం కార్యక్రమం ప్రధాన ఉద్దేశం పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడడమేనని తెలిపారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, చెట్ల పెంపకంతో భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణంతో పాటు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ప్రతి ఇంటి వద్ద, ప్రతి గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాదారం ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, ఉపాధిహామీ టీఏ ప్రసాద్, వార్డు సభ్యులు బానేష్, కత్తెర్ల రవికుమార్, కాంగ్రెస్ నాయకులు బూతుకూరి కమలాకర్, నరేష్, మేట్ పుప్పాల పుష్ప, విజయ్, మీనుగు కృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

# ఐటీ టవర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** మావల మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఐటీ టవర్ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం ఐటీ టవర్ నిర్మాణ ప్రాంతాన్ని అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఈ ఐటీ టవర్ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. అత్యాధునిక సౌకర్యాలతో భవనాన్ని తీర్చిదిద్ది నిర్ణీత గడువులోగా ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. భవన నిర్మాణంతో పాటు అంతర్గత రహదారులు, విద్యుదీకరణ, నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక సబ్‌స్టేషన్ ఏర్పాటు, తాగునీటి వసతి, హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్టివిటీ, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, సాంకేతిక సమస్యలు, ఇతర ఇబ్బందులు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ జోనల్ మేనేజర్ ఎం.శివప్రసాద్, డీజెడ్ఎం బహుగుణ, సీఈ నరేందర్ రెడ్డి, ఎలక్ట్రికల్ డీఈ పురేందర్, నిర్మాణ సంస్థ ఇంజనీర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం



**రాజముద్ర న్యూస్, తాండూర్:** తాండూర్ సెక్టార్ పరిధిలోని అచలాపూర్ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వరూపరాణి తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు సాంప్రదాయబద్ధంగా అన్నప్రాసన నిర్వహించడంతో పాటు వారి ఎత్తు, బరువును కొలిచి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తల్లిదండ్రులకు అవసరమైన సూచనలు అందించారు. అనంతరం తల్లులు, గర్భిణీలకు సీజనల్ వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షిత తాగునీటి వినియోగం, సమతుల్య పోషకాహారం తీసుకోవడంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కౌసల్య, తల్లులు, గర్భిణీలు, చిన్నారులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

# టాస్క్ శిక్షణతో జిల్లా అభ్యర్థులకు టీసీఎస్లో ఉద్యోగాలు

అభినందించిన కలెక్టర్ కుమార్ దీపక్

**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** నిరుద్యోగ యువతకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ద్వారా అందిస్తున్న నైపుణ్య శిక్షణ ఫలితంగా జిల్లాకు చెందిన ముగ్గురు అభ్యర్థులు టీసీఎస్ క్యాంపస్ ప్లేస్మెంట్లో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ సాంకేతిక కోర్సుల్లో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా టాస్క్ కేంద్రం సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. శిక్షణతో పాటు క్యాంపస్ ప్లేస్మెంట్ల ద్వారా ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. టాస్క్ కేంద్రంలో శిక్షణ పొందిన జి.కావ్య, ఎం.అంజలి, కె.సాయివాణి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి టీసీఎస్ క్యాంపస్ ప్లేస్మెంట్లో ఎంపికై ఉద్యోగాలు సాధించడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. టాస్క్ ద్వారా అందిస్తున్న ఉచిత నైపుణ్య శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభం

**రాజముద్ర న్యూస్, కౌటాల:** కౌటాల మండలంలోని శీర్ష గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఆదిలాబాద్ ఎంపీ గోడం నాగేశ్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించడంలో ఈ భవనం కీలకంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# కొలంబియా షూటౌట్.. క్వార్టర్స్‌లోకి స్విట్జర్లాండ్



**వాంకోవర్:** ఫిఫా వరల్డ్‌కప్‌లో మంగళవారం మరో మ్యాచ్ ఉత్కంఠంగా జరిగింది. స్విట్జర్లాండ్ పెనాల్టీ షూటౌట్ ఆధారంగా కొలంబియాపై విజయాన్ని నమోదు చేసింది. 4-3 గోల్స్ తేడాతో షూటౌట్‌లో స్విస్ నెగ్గింది. తొలుత ఇరు జట్ల మధ్య రౌండ్16 మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఎక్స్‌ట్రా టైంలో కూడా రెండు జట్లు గోల్స్ చేయలేకపోయాయి. అయితే పెనాల్టీ షూటౌట్‌లో మాత్రం స్విస్‌కు కలిసి వచ్చింది. కీలకమైన నిర్ణయాత్మక పెనాల్టీని రూబెన్ వర్గాస్ గోల్‌గా మలచడంతో స్విట్జర్లాండ్ బృందంలో సంబరాలు మొదలయ్యాయి. కొలంబియాపై 4-3 తేడాతో షూటౌట్‌లో నెగ్గిన స్విట్జర్లాండ్.. క్వార్టర్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాతో తలపడనున్నది. మిస్సోరీలోని కన్సాస్ సిటీలో శనివారం ఈ మ్యాచ్ జరగనున్నది. ఫిఫా వరల్డ్‌కప్‌లో 1954 నుంచి ఇప్పటి వరకు స్విట్జర్లాండ్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించలేదు. వరల్డ్‌కప్‌లో రెండు గోల్స్ కొట్టిన స్విస్ ప్లేయర్ వర్గాస్ ఈ మ్యాచ్‌లో స్టాపేజ్ టైంలో ఎంట్రీ ఇచ్చాడు. కొలంబియా ప్లేయర్లు డేవిన్సన్ సాంచేజ్, కూచో హెర్నాండేజ్ .. షూటౌట్‌లో విఫలం అయ్యారు. దీంతో స్విట్జర్లాండ్ విక్టరీకి మార్గం ఈజీ అయ్యింది. వాస్తవానికి స్విట్జర్లాండ్ జట్టులో కీలక ప్లేయర్ అయిన జోహన్ మన్‌జంబీ.. మోకాలి గాయం వల్ల ఈ మ్యాచ్‌లో ఆడలేదు. అటాక్ ప్లేయర్ లేకపోవడంతో స్విస్ తీవ్ర ఇబ్బందులు పడింది.



# మెస్సీ-ఈజిప్ట్ కోచ్ మధ్య వాగ్వాదం

**అట్లాంటా, జూలై 8:** ఫిఫా ప్రపంచకప్ ప్రిక్వార్టర్ పోరు ముగిసిన తర్వాత అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ, ఈజిప్ట్ ప్రధాన కోచ్ హోసమ్ హసన్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఉత్కంఠభరిత మ్యాచ్‌లో 3-2 గోల్స్ తేడాతో అర్జెంటీనా విజయం సాధించిన అనంతరం మైదానంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మ్యాచ్ ముగిసిన వెంటనే టచ్‌లైన్ వద్ద మెస్సీ, హోసమ్ హసన్ ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా ఈజిప్ట్ కోచ్ ఆగ్రహంతో రెండు చేతులను 'ఎక్స్' ఆకారంలో చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఈజిప్ట్ కోచింగ్ సిబ్బందిలోని ఓ సభ్యుడు మెస్సీ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా, మ్యాచ్ అధికారులు అతడికి రెడ్ కార్డు చూపించారు. వెంటనే అర్జెంటీనా ఆటగాళ్లు మెస్సీని చుట్టుముట్టగా, భద్రతా సిబ్బంది పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అయితే మెస్సీ, హసన్ మధ్య జరిగిన సంభాషణ ఏమిటన్నది అధికారికంగా వెల్లడికాలేదు. మ్యాచ్ అనంతరం హోసమ్ హసన్ చేసిన 'ఎక్స్' సంకేతంపై వివాదం నెలకొంది. మెస్సీని ఉద్దేశించి జాతి వివక్షకు సంబంధించిన వ్యాఖ్యలు లేదా సంకేతాలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై ఇంకా స్పష్టత రాలేదని, ఆ సంకేతం అర్థంపై దర్యాప్తు కొనసాగుతోందని ఫిఫా, ఈజిప్ట్ ఫుట్‌బాల్ సంఘం తెలిపాయి. అవసరమైతే ఫిఫా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. మ్యాచ్‌లో తొలిర్థంలో రెండు గోల్స్‌తో ఆధిక్యంలో నిలిచిన ఈజిప్ట్, చివరి నిమిషాల్లో వరుసగా మూడు గోల్స్ సమర్పించుకోవడంతో 3-2 తేడాతో పరాజయం పాలైంది. ఈ ఓటమిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఈజిప్ట్ కోచ్, మ్యాచ్ రిఫరీలు అర్జెంటీనాకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. తమ జట్టుకు అన్యాయం జరిగిందని పేర్కొంటూ, ఈ ప్రపంచకప్‌లో మిగిలిన మ్యాచ్‌లను తాను చూడబోనని వ్యాఖ్యానించారు.

# 76 పరుగులకే కుప్పకూలిన టీమిండియా

## చరిత్రలో భారత్ సాధించిన అత్యల్ప స్కోర్లు ఇవే!



టీ20 క్రికెట్‌లో అత్యంత భారీ బ్యాటింగ్ లైనప్ లలో టీమిండియా ఒకటి. 2024, 2026 వరుస టీ20 ప్రపంచకప్‌లు గెలవడంతో పాటు మధ్యలో ఆసియా కప్ టీ20 టైటిల్‌ను కూడా కైవసం చేసుకుని ఈ ఫార్మాట్‌లో భారత్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. అయితే ఎంత బలమైన జట్టైనా కొన్ని సందర్భాల్లో తీవ్ర వైఫల్యాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇంగ్లండ్‌తో నాటింగ్‌హామ్‌లో జరిగిన మూడో టీ20లో భారత్ కేవలం 76 పరుగులకే ఆలౌట్ కావడంతో టీ20 చరిత్రలో మరో చెత్త రికార్డు నమోదైంది. 202 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్ పవర్‌ప్లేలోనే పెవిలియన్ చేరడంతో మ్యాచ్ పూర్తిగా ఇంగ్లండ్ చేతుల్లోకి వెళ్లిపోయింది. చివరకు భారత్ 11.4 ఓవర్లలో 76 పరుగులకే ఆలౌట్ అయి 125 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఇది భారత్ రెండో అత్యల్ప స్కోరుగా నిలిచింది.

### టీ20ల్లో భారత్ అత్యల్ప స్కోర్లు:

#### 74 VS ఆస్ట్రేలియా (మెల్‌బోర్న్, 2008):

టీ20 ప్రపంచకప్ గెలిచిన కొద్ది నెలల తర్వాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ కేవలం 74 పరుగులకే ఆలౌట్ అయింది. నాథన్ బ్రాకెన్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా బౌలర్లు భారత బ్యాటింగ్‌ను కుప్పకూల్చగా.. ఆతిథ్య జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

#### 76 vs ఇంగ్లండ్ (నాటింగ్‌హామ్, 2026):

ఇంగ్లండ్‌తో మూడో టీ20లో టీమిండియా 76 పరుగులకే ఆలౌట్ కావడం భారత టీ20 చరిత్రలో రెండో అత్యల్ప స్కోరుగా నమోదైంది. ఈ ఓటమితో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 0-2తో వెనుకబడింది.

#### 79 vs న్యూజిలాండ్ (నాగ్‌పూర్, 2016):

2016 టీ20 ప్రపంచకప్‌లో నాగ్‌పూర్ వేదికగా న్యూజిలాండ్ నిర్దేశించిన 127 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ 79 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ సాంట్నర్ (4 వికెట్లు), ఇష్ సోధి (3 వికెట్లు) భారత బ్యాటర్లను కట్టడి చేశారు. టీ20 ప్రపంచకప్ చరిత్రలో భారత్‌కు అత్యల్ప స్కోరులలో ఇదొకటి.

#### 81/8 vs శ్రీలంక (కొలంబో, 2021):

2021లో శ్రీలంకతో జరిగిన మూడో టీ20లో భారత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి కేవలం 81 పరుగులే చేసింది. ఆ మ్యాచ్‌లో కుల్దీప్ యాదవ్ 23 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవడం విశేషం. వనిందు హసరంగా నాలుగు వికెట్లు తీసి శ్రీలంక విజయంలో కీలక పాత్ర పోషించాడు.

#### 92 vs దక్షిణాఫ్రికా (కటక్, 2015):

2015లో కటక్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20లో భారత్ 92 పరుగులకే ఆలౌట్ అయింది. కగిసో రబాడా, క్రిస్ మోరిస్ ధాటికి భారత టాప్ ఆర్డర్ కుప్పకూలింది. రోహిత్ శర్మ, సురేశ్ రైనా కలిసి చేసిన 44 పరుగులే జట్టుకు ప్రధాన ఆధారంగా నిలిచాయి. చివరకు భారత్ ఆ మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో ఓడిపోయింది. టీ20 ప్రపంచకప్ గెలిచిన కొద్ది నెలల్లోనే భారత బ్యాటింగ్ ఈ స్థాయిలో కుప్పకూలడం అభిమానులను నిరాశకు గురిచేస్తుంది. వరుసగా కీలక వికెట్లు కోల్పోవడం, భారీ లక్ష్యాల ఛేదనలో ఒత్తిడిని తట్టుకోలేకపోవడం జట్టుకు ప్రధాన సమస్యగా మారింది.

# టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌పై దినేశ్ కార్తీక్ ఆగ్రహం


**లండన్, జూలై 8:** ఇంగ్లండ్ చేతిలో మూడో టీ20లో టీమిండియా ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ జట్టు మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా బ్యాటింగ్ ఆర్డర్‌లో చేసిన మార్పులే ఓటమికి ప్రధాన కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. మ్యాచ్ సందర్భంగా ఓ స్పోర్ట్స్ ఛానల్ ప్రత్యక్ష ప్రసారంలో మాట్లాడిన కార్తిక్, శివమ్ దూబే కంటే ముందు హర్షిత్ రాణాను బ్యాటింగ్‌కు పంపడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. "శివమ్ దూబే కంటే ముందు హర్షిత్ రాణా బ్యాటింగ్‌కు రావడమా? మీరు నన్ను ఆటపట్టిస్తున్నారా?" అంటూ లైవ్‌లోనే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. టీ20ల్లో కుడి--ఎడమ చేతి బ్యాటర్ల కాంబినేషన్ కోసం ప్రయత్నించడం ఒక దశ వరకు సమంజసమేనని, కానీ అందుకోసం అనుభవజ్ఞుడైన శివమ్ దూబే కంటే ముందుగా హర్షిత్ రాణాను పంపడం సరైన నిర్ణయం కాదని కార్తిక్ వ్యాఖ్యానించారు. దేశీయ క్రికెట్‌లో కూడా హర్షిత్ రాణా పవర్‌ప్లేలో బ్యాటింగ్ చేసిన సందర్భాలు చాలా అరుదని ఆయన గుర్తుచేశారు. మూడో టీ20లో ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన హర్షిత్ రాణా 13 బంతుల్లో 9 పరుగులు మాత్రమే చేయగా, అనంతరం క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే కూడా రెండు పరుగులకే ఔటయ్యాడు. దీంతో భారత బ్యాటింగ్ పూర్తిగా కుప్పకూలి, జట్టు కేవలం 76 పరుగులకే ఆలౌటైంది. ఇదిలా ఉండగా, టీమిండియా వరుస ఓటములపై సోషల్ మీడియాలో అభిమానుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జట్టు ఎంపిక, బ్యాటింగ్ క్రమంలో తరచూ మార్పులు చేయడంపై మేనేజ్‌మెంట్‌ను అభిమానులు ప్రశ్నిస్తున్నారు. బ్యాటర్లలో ఎవరూ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడకపోవడం కూడా పరాజయానికి ప్రధాన కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంగ్లండ్ ఇప్పటికే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో కొనసాగుతోంది. సిరీస్‌ను సజీవంగా ఉంచుకోవాలంటే బ్రిస్టల్ వేదికగా గురువారం జరిగే నాలుగో టీ20లో భారత్ తప్పనిసరిగా విజయం సాధించాల్సి ఉంది.



# క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన ఎనిమిది జట్లు




**అట్లాంటా, జూలై 8:** ఫిఫా ప్రపంచకప్-2026 రౌండ్--16 పోటీలు ఉత్కంఠభరితంగా ముగిశాయి. ఆఖరి నిమిషాల్లో నమోదైన గోల్స్, అనూహ్య ఫలితాలు, దిగ్గజ ఆటగాళ్ల భావోద్వేగ వీడ్కోళ్లతో ఈ దశ అభిమానులను ఉర్రూతలూగించింది. ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన టైటిల్ కోసం జరుగుతున్న పోరు ఇప్పుడు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. ఈ దశలో అతిపెద్ద సంచలనంగా ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ బ్రెజిల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. న్యూజెర్సీలో జరిగిన మ్యాచ్‌లో నార్వే 2-1 తేడాతో బ్రెజిల్‌ను ఓడించింది. నార్వే స్టార్ ఆటగాడు ఎర్లింగ్ హాలండ్ రెండు గోల్స్ చేసి జట్టు విజయానికి ప్రధాన కారణమయ్యాడు. ఈ ఓటమితో బ్రెజిల్ స్టార్ నెయ్మర్ తన చివరి ప్రపంచకప్‌ను నిరాశతో ముగించాడు. మరోవైపు పోర్చుగల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో ప్రపంచకప్ ప్రయాణం కూడా ముగిసింది. స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో చివరి నిమిషంలో మైకెల్ మెరినో చేసిన గోల్‌తో పోర్చుగల్ 1-0 తేడాతో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా అద్భుత పునరాగమనంతో క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఈజిప్ట్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒక దశలో 2-0తో వెనుకబడిన అర్జెంటీనా, కెప్టెన్ లియోనెల్ మెస్సీ స్ఫూర్తిదాయక ఆటతో కేవలం 13 నిమిషాల్లో మూడు గోల్స్ చేసి 3-2తో సంచలన విజయం సాధించింది. ఇతర మ్యాచ్‌ల్లో మొరాకో కెనడాపై విజయం సాధించి చివరి ఎనిమిది జట్లలో చోటు దక్కించుకుంది. ఫ్రాన్స్ మాత్రం పరాగ్వేపై తీవ్ర పోరాటం అనంతరం కైలియన్ ఎంబాపే పెనాల్టీ గోల్‌తో గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. వివాదాల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో బెల్జియం అమెరికాను 4-1 తేడాతో చిత్తు చేసింది. కొలంబియాతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో స్విట్జర్లాండ్ పెనాల్టీ షూటౌట్‌లో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఇప్పుడు ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్స్‌లో మిగిలిన ఎనిమిది జట్లు టైటిల్ కోసం హోరాహోరీ పోరుకు సిద్ధమయ్యాయి.



# సెమీఫైనల్లో సినర్, గాఫ్

**లండన్:** వింబుల్డన్‌లో టైటిల్ నిలబెట్టుకునే దిశగా సాగుతున్న డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సినర్ ఆ క్రమంలో మరో అడుగు ముందుకేశాడు. పురుషుల సింగిల్స్‌లో ఈ టాప్ సీడ్ ఇటలీ స్టార్ 7-5, 7-6 (7/4), 6-3తో యాన్ లెనార్డ్ స్ట్రఫ్ (జర్మనీ)ను ఓడించి టైటిల్‌కు రెండడుగుల దూరంలో నిలిచాడు. ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్ జ్వెరెవ్ 6-4, 7-5, 3-6, 7-6 (8/6)తో జిరి లెహెక (చెక్)ను ఓడించి క్వార్టర్స్ చేరాడు. మహిళల కోకో గాఫ్ (అమెరికా) 4-6, 6-3, 6-3తో తన దేశానికే చెందిన జెస్సికా పెగులాను ఓడించి లాస్ట్-4కు చేరుకుంది. మరో క్వార్టర్స్‌లో నవొమి ఒసాకా (జపాన్).. 6-7 (4/7), 4-6తో కరోలినా ముచోవా (చెక్) చేతిలో ఓడింది. ఈ టోర్నీలో సెమీస్‌కు చేరడం గాఫ్, ముచోవాకు ఇదే మొదటిసారి కావడం విశేషం.




## సెప్టెంబరులో 'ఓజీ 2' సందడి

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఓజీ 2' చిత్రంపై సంగీత దర్శకుడు ఎస్. థమన్ ఆసక్తికరమైన సంకేతం ఇచ్చారు. దర్శకుడు సుజీత్ తెరకెక్కించనున్న ఈ సీక్వెల్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా, థమన్ చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపాయి. గత ఏడాది దసరా సందర్భంగా విడుదలైన 'ఓజీ' గ్యాంగ్‌స్టర్ యాక్షన్ చిత్రంగా ఘన విజయం సాధించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం పవన్ కళ్యాణ్ సినీ జీవితంలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఈ విజయంతోనే చిత్రబృందం 'ఓజీ 2'ను అధికారికంగా ప్రకటించింది. ఇటీవల పవన్ కళ్యాణ్ సామాజిక మాధ్యమాల వేదికగా 'ఓజీ' విశ్వాన్ని మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. దర్శకుడు సుజీత్‌తో మరోసారి కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలు కొనసాగుతున్నాయని నిర్మాణ సంస్థ కూడా స్పష్టం చేసింది. దీంతో సీక్వెల్ ఎప్పుడు ప్రారంభమవుతుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో జరిగిన 'హృదయం మురళి' సినిమా విడుదలకు ముందు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న థమన్‌ను అభిమానులు "ఓజీ... ఓజీ..." అంటూ నినాదాలతో పలకరించారు. దీనికి స్పందించిన ఆయన "సెప్టెంబరులో కలుద్దాం" అని ఒక్క మాట చెప్పడంతో అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. థమన్ వ్యాఖ్యల నేపథ్యంలో సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా 'ఓజీ 2' తొలి చూపు, ప్రచార వీడియో, శీర్షిక ప్రకటన లేదా మరో ప్రత్యేక సమాచారం విడుదలయ్యే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ థమన్ వ్యాఖ్యలతో 'ఓజీ 2'పై అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి.

## 'రాకా'లో అవకాశం కోల్పోయిన ప్రీతీ



స్టార్ హీరో అల్లు అర్జున్, బాలీవుడ్ నటి దీపికా పదుకోణె జంటగా దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం లిలి'రాకా'లిలిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అత్యాధునిక సాంకేతికత, భారీ నిర్మాణ వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రం గురించి వస్తున్న ప్రతి వార్త సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని దర్శకుడు అట్లీ వెల్లడించారు. యువ నటి ప్రీతీ ముకుందన్‌ను 'రాకా'లోని ఒక కీలక పాత్ర కోసం సంప్రదించినప్పటికీ, ఆమె బిజీ షెడ్యూల్ కారణంగా ఆ పాత్రను చేయలేకపోయారని అట్లీ తెలిపారు. ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' చిత్రంతో ప్రీతీ ముకుందన్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అంతకుముందు 'కన్నప్ప' చిత్రంలో నటించి తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువయ్యారు. ప్రస్తుతం పలు భాషల్లో వరుస అవకాశాలతో ఆమె బిజీగా ఉన్నారని తెలిపారు. ఇటీవల జరిగిన 'ఇదయం మురళీ' సినిమా ప్రీ-రిలీజ్ కార్యక్రమంలో పాల్గొన్న అట్లీ మాట్లాడుతూ, ప్రీతీ ముకుందన్‌ను ఈ చిత్రంలో నటింపజేయాలని భావించామని, అయితే ఆమె ముందే ఇతర చిత్రాలకు అంగీకరించడంతో తేదీలు కుదరకపోయాయని వివరించారు. ప్రీతీ చేయాల్సిన పాత్రను చివరకు నటి ఫెమినా జార్జ్‌కు అప్పగించినట్లు అట్లీ వెల్లడించారు. దీంతో 'రాకా'లో ఫెమినా జార్జ్ ఎలాంటి పాత్రలో కనిపించనున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. అల్లు అర్జున్--అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న తొలి చిత్రం కావడంతో 'రాకా'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. హై వోల్టేజ్ యాక్షన్, అత్యున్నత నిర్మాణ విలువలు, అంతర్జాతీయ స్థాయి సాంకేతికతతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. అల్లు అర్జున్ సరసన దీపికా పదుకోణె నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై మరింత ఆసక్తి పెరిగింది. త్వరలోనే చిత్రీకరణకు సంబంధించిన తదుపరి వివరాలను చిత్రబృందం ప్రకటించే అవకాశం ఉంది.



## అప్పుడు మహేశ్‌బాబు స్టార్‌డమ్ గురించి తెలియదు

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుకి ఉన్న క్రేజ్ ఎలాంటిదో బాలీవుడ్ స్టార్ బ్యూటీ కృతి సనన్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన సైకలాజికల్ థ్రిల్లర్ ' నేనొక్కడినే' (2014) సినిమాతోనే కృతి సనన్ వెండితెరకు పరిచయమైన సంగతి తెలిసిందే. ఈ డెబ్యూ మూవీ జ్ఞాపకాలను పంచుకుంటూ, సినిమా ఒప్పుకునే సమయానికి తనకు తెలుగు సినిమాలపై గానీ, మహేష్ బాబు రేంజ్ ఏంటో గానీ పెద్దగా అవగాహన లేదని ఆమె చెప్పారు. తాను హిందీ సినిమాలు చూస్తూ పెరగడం వల్ల మొదట్లో మహేష్ బాబుని కలిసినప్పుడు ఒక నార్మల్ సీనియర్ నటుడిలా చాలా క్యాజువల్‌గా కలిశానని, ఆయనకున్న క్రేజ్ ఏంటో తనకు అప్పుడు తెలియదని అన్నారు. కానీ, ఎప్పుడైతే తాను '1: నేనొక్కడినే' షూటింగ్ సెట్స్‌లోకి అడుగుపెట్టానో, ఆ తర్వాత జరిగిన భారీ ఆడియో లాంచ్ ఈవెంట్‌ను కళ్లారా చూశానో? అప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబు రేంజ్, ఆయనకున్న స్టార్‌డమ్, అబిమానుల్లో ఉన్న విపరీతమైన క్రేజ్ ఏంటో తనకు పూర్తిగా అర్థమైందని కృతి సనన్ వివరించారు. నటనలో ఎలాంటి ముందస్తు శిక్షణ లేకపోయినా డైరెక్టర్ సుకుమార్ తనను నమ్మి ఈ సినిమాలో హీరోయిన్ ఛాన్స్ ఇచ్చారని, షూటింగ్ లోకేషన్స్ కి వచ్చే జనాల్ని, ముఖ్యంగా థియేటర్లలో జరిగిన ఆడియో ఫంక్షన్‌కు వచ్చిన ఊహించని రద్దీని చూసి తాను షాక్ అయ్యానని ఈ బాలీవుడ్ భామ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 2014 జనవరిలో విడుదలైన ఈ సినిమా పరాజయం పాలవ్వగా.. ప్రస్తుతం బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న కృతి సనన్, తన కెరీర్ టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో ప్రారంభం కావడం ఎప్పటికీ స్పెషల్ అని సంతోషం వ్యక్తం చేశారు.

## చదువుకోసమే ఛాన్స్ వదులుకున్నా

నటి హ్యూమా ఖురేషీ ఆసక్తికర వ్యాఖ్యలు



ప్రస్తుతం 'ఇడుపు కాయితం' చిత్రంతో కథానాయికగా పరిచయం కానున్న నటి నాగ దుర్గ, ఒకప్పుడు స్టార్ హీరో నాని నటించిన 'శ్యామ్ సింగరాయ్' సినిమాలో నటించే అవకాశాన్ని చదువు కోసం వదులుకున్నట్లు వెల్లడించారు. ఇటీవల తమిళ చిత్రం 'లవ్ ఓ లవ్' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాన్ని పంచుకున్నారు. డిగ్రీ చదువుతో పాటు జర్నలిజం కోర్సు చేస్తున్న సమయంలో 'శ్యామ్ సింగరాయ్'లో సాయి పల్లవి స్నేహితురాలి పాత్రకు అవకాశం వచ్చిందని, అయితే పరీక్షలు ఉండటంతో ఆ అవకాశాన్ని వదులుకోవాల్సి వచ్చిందని నాగ దుర్గ తెలిపారు. విద్య తన జీవితంలో ఎంతో ముఖ్యమని, అందుకే చదువుకు ఆటంకం కలిగించే సినిమా అవకాశాలను అంగీకరించలేదని చెప్పారు. ఇదొక్కటే కాకుండా మరికొన్ని అవకాశాలను కూడా ఇదే కారణంతో తిరస్కరించినట్లు వెల్లడించారు. కూచిపూడి నర్తకిగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన నాగ దుర్గ, తర్వాత జానపద నృత్యం వైపు అడుగులు వేశానని తెలిపారు. ఫోక్ డ్యాన్స్ ద్వారా తనకు మరింత గుర్తింపు లభించిందని, సోషల్ మీడియా వల్ల జానపద కళలకు మంచి ఆదరణ పెరిగిందని చెప్పారు. ప్రస్తుతం జానపద గీతాలు, నృత్యాలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. సినిమాల ఎంపిక విషయంలో తాను ఒక ప్రత్యేక సూత్రాన్ని పాటిస్తానని నాగ దుర్గ తెలిపారు. ప్రతి సినిమా ప్రేక్షకులకు ఏదో ఒక మంచి సందేశాన్ని అందించేలా ఉండాలని భావిస్తానని చెప్పారు. తాను నటించిన 'కలివనం' మంచి సందేశంతో రూపొందిందని, ఇటీవల విడుదలైన 'ఇదుపు కాయితం' కూడా సమాజానికి ఉపయోగపడే అంశాన్ని చెప్పే చిత్రమని వెల్లడించారు. మంచి కథలు, విలువలతో కూడిన పాత్రలకే ప్రాధాన్యం ఇస్తానని ఆమె స్పష్టం చేశారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com